
365

ఆంధ్రమహిళ

am-JUN-1948-4-12



JUNE 1948 ANDHRA MAHILA ANNAS 6

విజయము

కాశీ హిందూవిశ్వవిద్యాలయ మెట్రిక్యులేషన్ పరీక్షకు ఈ సంవత్సరము మా విద్యాలయమునుండి హాజరైన 19 మంది స్త్రీలలోనూ, 13 గ్గురు కృతార్థులైరని తెలుపుటకు సంతసించుచున్నాము. వీరిలో కృష్ణకుమారి, సీతాలక్ష్మి, నాగరాజమ్మ, రత్నమ్మ, లక్ష్మి, సీతమ్మ, శశికళ, శ్యామల, సుభద్రాబాయిసింగ్, సి. భార్గవి, వీరు 10 మంది ద్వితీయ శ్రేణిలోను ఎమ్. భార్గవి, వి. సుభద్ర, లలిత, వీరు ముప్వురు తృతీయ శ్రేణిలోనూ, విజయమునొందిరి.

ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మా హృదయపూర్వక అభినందనముల నందచేయుచు, మహిళాసభ విద్యాశాఖ యొక్క ప్రాశస్త్యమును ఈ విధముగా నిరూపించిన ఉపాధ్యాయ వర్గమునకు మా కృతజ్ఞతను వెల్లడిస్తున్నాము.

ఆంధ్రమహిళాసభ

ఆంధ్రమహిళ

సంపుటి 4 :: (జూన్ '48) :: సంచిక 12

ముఖచిత్రం: అమరజీవి శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవిగారు

సంపాదకురాలు: దుర్గాబాయి, యమ్. యే., బి. యల్.

సహసంపాదకురాలు: మామిడిపూడి. వైదేహి బి. యే., (ఆనర్సు)

—: ప్రచురణ :—

ఆంధ్రమహిళా సభ, మైలాపూరం

సంవత్సర చందా　అయిదు రూపాయలు

ఆంధ్రమహిళ

సంపుటి 4 | జూన్ 1948 | సంచిక 12

మద్రాసులో ఆంధ్ర బాలబాలికల విద్య

వేసవి సెలవులు గడచిపోవుచున్నవి. పాఠశాలలన్నియు యింక ఇరువది రోజులలో తిరిగివాటి విద్యాప్రదాన కర్తవ్యమును ఉత్సాహముతో ప్రారంభింపనున్నవి. అనగా, మదరాసులోని ఆంధ్రులకు తమ బిడ్డల చదువు నిమిత్తమై అల్లాట తిరిగి ప్రారంభమగునన్న మాట. శ్రీ కేసరిగారివంటి ఆంధ్రాభిమానులు, ప్రఖ్యాతదాతలు, ఆంధ్ర బాలబాలికలకై ప్రత్యేక పాఠశాలల నెలకొల్పుట చాల ఉత్సాహకరమైన విషయము. వారుయిందులకై చాల అభివందనీయులు. అయితే చెన్నపట్టణములోని తెలుగు బిడ్డలకరవు దీర్చుట కివి ఎంత మాత్రముచాలవు.

మదరాసులో ఒక్కొక్క పేటలోనూ ఒక్కొక్క వీధిలోనూ ఆంధ్రులున్నారు. వారి బిడ్డలున్నారు. వీరందఱకు మాతృభాషయైన తెలుగునందు బోధన జరుగుట ఉచితము. అట్లుజరిపించుట ప్రజా ప్రభుత్వము యొక్క విధాయకమని వేరుగా చెప్పుట అనవుసరము. ప్రత్యేక తెలుగు పాఠశాలలనొకటిరెండింటిని ఏదే నొకమూల నెలకొల్పుటవలన యీ సమస్యకడతేరదు. అందుకని వీధి వీధిని ఒక్కొక్క తెలుగుపాఠశాలను ఏర్పాటుచేయుట సాధ్యమైన పనికానూకాదు. ప్రస్తుతము ఉన్న పాఠశాలలలోనూ, యింకమీద ప్రారంభించే పాఠశాలలలోనూగూడ, తెలుగు బిడ్డలకు కూడ తమిళ బిడ్డలవలెనే సమానమైన అవకాశముల నిచ్చిననాడే ఈ సమస్య పరిష్కారము కాగలదు.

రమారమి 1500 మంది బాలురుగల పి. ఎస్. హైస్కూలులోనూ, 1000 మందికన్న ఎక్కువ బాలికలు విద్యనభ్యసించుచున్న లేడీ శివస్వామి అయ్యర్ గరల్సు హైస్కూలులోనూ యింకా ప్రఖ్యాతికెక్కిన రామకృష్ణ బాలబాలికా పాఠశాలలోను, విద్యోదయా

మొదలగు పెద్ద బడులలోకూడ, తెలుగుపిల్లలకు సరియైన అవకాశము లింతవరకు కల్పింపక పోవుటయే గాక, యిటుపైని, ఆ కొంచము సదుపాయములు కూడ నిర్మూలింప ప్రయత్న ములు జరుగుచుండుట చాలశోచనీయ విషయము. ఈ ప్రైవేటుబడులనటుండనిచ్చి, ప్రభుత్వ పాఠశాలలలో మాత్రము తెలుగు బిడ్డలకేమి అవకాశములున్నవి ?

ఒక్కొక్క తరగతిలో 20 మంది విద్యార్థినులైనా లేకుండుట వల్ల ఇట్లు కొన్ని చోట్ల తెలుగు సెక్షన్లుమూసి వేయుటయు, క్రొత్తచోట్ల తెలుగు సెక్షన్లు తెరచుటకువీలు లేకపోవుటయు జరుగుచున్నదని తమిళ అధికారులు చెప్పినచో మిక్కిలిచమత్కారమని చెప్పకతప్పదు. తెలుగు అధికారులు చెప్పినచో శుద్ధ అవివేకమని దుఃఖించకతప్పదు.

అసలు నిజా నిజములు విచారించిన తెల్లమగునదే మనగా, కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలలో, ఉచిత విద్యనభ్యసింపవలెనను యిచ్ఛతో జేరు మధ్యతరగతికి జెందిన, బీద వారైన తెలుగు బాలికలకు, తెలుగు విద్యనంద జేయక పోవుటయే యిందులకు ప్రధాన కారణము. తెలుగు వారు తమ పిల్లలను జేర్చుటకు వెళ్లినప్పుడు ఆ స్కూలులో తెలుగు సెక్షను లేదనియో ప్రత్యేకముగ తెలుగు సెక్షను పెట్టుటకు అధికారులు ఒప్పరనియో, ఏదో ఒక సాకుపెట్టి, ఆ బిడ్డను అరవతరగతిలో జేర్పించుట తప్పగత్యంతరము లేదను భావమువారి తల్లిదండ్రులకు గలిగించుట పరిపాటియైనది. అసలే బీదవారు, విద్యాజ్ఞానము, వ్యవహారజ్ఞా నము లేని వారునైన ఆ తల్లి దండ్రులు, మనసులో వ్యథగలిగికూడ చేయునది ఏమియు లేక, తమ బిడ్డలను ఆ అరవతరగతులలో జేర్పించుట సంభవించుచున్నది. మాతృభాష తెలుగై, బడిలో అరవము నభ్యసించుచున్న బాలబాలికల జనాభా బయటకు తీయించి నచో, యీ విషయము ఋజువుకాగలదు.

ఇట్లు ప్రాథమిక తరగతులలో గత్యంతరము లేక అరవమునభ్యసించిన విద్యార్థినులు, మధ్యమతరగతులలోను, ఉన్నత తరగతులలోనూకూడ, అరవమునే అభ్యసించుటవలన, చిన్నప్పుడు కొన్ని ప్రత్యేక అవకాశముల వల్లగాని, ధనికులగుట వల్లగాని, తమ మాతృ భాషనువీడని తెలుగు పిల్లల సంఖ్య మధ్యమ ఉన్నత తరగతులలో చాల తక్కువగా కనుపించుచున్నది. అందువల్ల తమిళమే ప్రాంతీయ భాషయని, తక్కువ సంఖ్యగల తెలుగువారికై ప్రత్యేకముగ తరగతులు ఏర్పాటు చేయుట ఆర్థికముగ సాధ్యపడని విషయ మని తమిళ అధికారులు చమత్కారముగ నిరూపించుట, మన తెలుగు అధికారులు గ్రుడ్డి తనముగా నమ్మట జరుగుచున్నవి.

మద్రాసులో ఆంధ్ర బాలబాలికల విద్య

అందువల్ల, చన్నపట్నములోనుండు తెలుగు బాల బాలికలకు విద్య మాతృభాషలో గరపవలెనని విశ్వసించు ఆంధ్రులు చేయవలసినది సభలు, సరంజాములు, అల్లరులు, వృథాసంభాషణలు గావు. ఒక్కొక్క వీధికి వెళ్లి, అక్కడి తెలుగువారిని వారి బిడ్డలకు తెలుగునందే విద్య నేర్పించమని ప్రోత్సహించవలెను. అట్టివారిని అందరనూ గుమిగూర్చి, వారిచే కార్పొరేషను అధికారులకు తమ బిడ్డల విద్యావిషయమై న్యాయము జరుగునట్లు ఏర్పాట్లు చేయమని కోరుచూ దరఖాస్తులు పెట్టించవలెను. సరియైన జనాభా వివరాలు గుమ్మముగుమ్మమునుండి తెలిసికొని, నిజమైన విషయములను ప్రచురించవలెను.

అధికారులుగూడ, తెలుగువారు కట్టు పన్ను నంతయు తమిళవారి సదుపాయమునకే వ్యయపరుపక, న్యాయాన్యాయములు విచారించి, తెలుగు బిడ్డలకు మాతృభాషలో విద్య నభ్యసించు సదవకాశములను సమకూర్పవలెను. అందరి జన్మహక్కులను ప్రజా ప్రభుత్వము వారు సమదృష్టితో పాలింపక పోయిన, అంతఃకలహములు, అశాంతి, అసంతృప్తి ప్రబలిపోయి, ప్రజాబాహుళ్యానికి తీరని నష్టముకలిగింతురనుట వాస్తవము.

★ ఝాన్సీ కృష్ణాజీ దంపతులకు ★

మంగళాశీర్వచనములు

దేశమాత దాస్యవిముక్తికై అచంచలసేవయొనర్చి, తుదకు ఆసేవయందే ఆరోగ్య భంగమునొనర్చుకొని, అమర ధామమున కేగిన, ఆదర్శ ఆంధ్రస్త్రీమూర్తి కీ. శే. శ్రీ మాగంటి అన్నపూర్ణాదేవిగారి కుమార్తె, చిరంజీవిసౌభాగ్యవతి ఝాన్సీ లక్ష్మి వివాహము గతనెలలో శోభాయమానముగ మదరాసులో జరిగినది. ఆ నూతన దంపతులకు మా హృదయపూర్వక అభినందనములు, మంగళాశీర్వచనములను అందజేయుట మాకెంతయు ఆనందకరమైన కార్యము.

ఆంధ్రమహిళాసభ

సలహా కోరండి

మదరాసు పెన్సిల్ ఫ్యాక్టరీ

రకరకాల

స్టార్ ఆఫ్ ఇండియా పెన్సిల్సును

తయారు చేయువారు

★

హో అండ్ కంపెనీ

ఉత్తమ తరగతి ముద్రాపకులు,

లిథోగ్రాఫర్లు

★

వి. పెరుమాళ్ శెట్టి అండ్ సన్స్

ఉత్తమశ్రేణి స్టేషనరీవ్యాపారులు

★

నెం. 5 స్ట్రింగర్ వీధి,

మదరాసు—1

కట్నం లేని పెళ్లి

శ్రీమతి మల్లవరపు విజయలక్ష్మిగారు

మా అమ్మకు ముగ్గురమే ఆడ పిల్లలము. నేను అందరి కంటే చిన్న దాన్ని. మా పెద్దక్కయ్యను నాలుగువేలు కట్నమిచ్చి వేములవాడ కరణంగారి పెద్ద కుమారున కిచ్చి వివాహం చేశారు మా నాన్నగారు. మా బావ అప్పటికి బి. యే. పూర్తిచేసి ప్లీడరీ పరీక్షకు చదువుతున్నాడు. మా మా అక్కయ్య అత్తగారు రాక్షసావతారమని ఆ చుట్టు పక్కల గ్రామాదులలో పేరు పొందింది. మా బావ చదువు పూర్తి కాకుండానే ఆవేసవిలో మా అక్కయ్యను అత్తారింటికి పంపించెయ్యమని గొడవ మొదలెట్టింది. 'ఇప్పుడేమి తొందర, మీ అబ్బాయి చదువు పూర్తి కానియ్య'మంటే వీల్లేదంది. పైగా తన యిష్టాను సారం కోడలిని పంపించక పోతే కొడుక్కి మళ్లీ పెళ్లి చేసేస్తానందికూడాను. కరణం గారు మాత్రము భార్యాగారికి ఎదురు చెప్పలేరు. ఆమె చేసే పనికి 'తథాస్తు' అనడమే ఆయన పని. అప్పటికే మా అక్కయ్య మెట్రిక్యులేషన్ చదువుచున్నది. మా నాన్న గారు మరీ పట్టుదల మనిషి. 'పోనీ ఆడపిల్లలు గలవాళ్లము, కొంచెం తగ్గితే మునిగిపోయినదేమిటి ఎప్పటికైనా వాళ్లపిల్లని వాళ్లింటికి పంపించాలిసిందే కదా! పోనీ వాళ్లిష్టానుసారమే, పంపితే తీరిపోతుంది, ఎందుకొచ్చిన పట్టుదలలు, అని మా అమ్మ మా నాన్నగారి చెవిని ఇల్లుకట్టుకొని పోరింది. 'ఏడి శావులే, నోరు మూసుకో, నీకేం తెలుసు, నాకా నీవు చెప్పొచ్చేది.' అని మా నాన్న కొండ బద్దలయ్యేలాగ గావు కేకలు పెట్టేడు. మా అమ్మ హడిలిపోయి కిక్కురు మన కుండా వూరుకుంది. మా బావ చేతకూడా మా నాన్నగారిని అడిగించారు. మాటికి ముమ్మాటికి మా అక్కయ్యను వాళ్ల యిష్టంవచ్చినప్పుడు అత్తారింటికి పంపించేదిలేదని మా నాన్నగారు ఖండితంగా చెప్పేశారు.

చూస్తూవుండగానే మా బావకు మళ్లీ పెళ్లీ అవనే అయింది నాలుగువేల కట్నంతో. ఇంక మా అక్కయ్య చదువు పూర్తి చెయ్యడం తప్పని సరి అయిపోయింది. పాపం, దాని మనస్సులో ఎట్లావుండేదో ఎవరికీ చెప్పేది కాదు. నేను ఫోర్తుఫారంలోకి వచ్చేసరికి దాని బి. యే. అయిపోయింది. అప్పటికే మా బావకు నలుగురు పిల్లలు కూడా పుట్టేశారు.

మా చిన్నక్క ఈ బాధ ఏమీ లేకుండానే పెండ్లి కాకుండా మమ్ములవదలి వెళ్లిపోయింది పరలోకానికి. ఇక నేను మిగిలేను మా తల్లిదండ్రులకు పెండ్లి చేసేందుకు. నేను మెట్రిక్యులేషన్ పూర్తి చేశాను. పరీక్షా ఫలితాలు తెలిసినది మొదలు మా అమ్మ నాన్నగార్లకు ప్రతి రోజు యుద్ధమే నా పెండ్లి విషయమై. అమ్మేమో 'త్వరగా చూడండి ఏదైనా మంచి సంబంధం, మీరు ఆ విధంగా తాత్సారము చేస్తే పిల్ల పెండ్లెట్లా అవుతుంది. అదేమో చెట్టల్లే పెరిగిపోతోంది. ఏమోనబ్బా, దాని విషయమై తలుచుకున్నప్పుడల్లా నాకు నిద్రకూడా పట్టడములేదు!' అనేది అమ్మ. నాన్నేమో 'ఇట్లా నీ గోల పడలేకనే పెద్ద దాన్ని తొందరపడి ఆ రాక్షస పీనుక్కి అంటకట్టేను. దీన్ని కూడా అల్లాగే చెయ్యమనా నీ వుద్దేశ్యము? నేనైతే ఇంక పెండ్లి సంబంధం కోసం తిరగను. సంబంధం ఏదైనావచ్చినా కట్నం దమ్మిడీకూడా ఇవ్వను? అయితే అవుతుంది కాక పోతే కాకపోతుంది. వీళ్లే నా కొడుకులనుకుంటాను. ఇక మీద నీవు ఈ విషయమై ఆట్టే మాట్లాడేవంటే చూసుకో జాగ్రత్త' అని కేక లెట్టేవారు.

నా చిన్నప్పటినుండి ఈ పెండ్లి విషయమై వినడంవల్లను, తర్వాత మా అక్కయ్యకు జరిగిన సంఘటనవల్లను నాకు పెళ్లి మాటయెత్తితే వళ్లుమండు కొచ్చేది. అసలు మా నాన్న ఇంకా ఎవరైనా అన్నయ్యలు తప్ప మిగిలిన మొగవాళ్లంటే చెప్పలేనంత కోపంగావుండేది. 'స్త్రీలకు పురుషులు చెప్ప నంత అన్యాయం జేస్తున్నారు. న్యాయ చట్టముకూడా వాళ్లనే సమర్థిస్తుందాయెను. సృష్టిలో స్త్రీ పురుషులు సమాన భాగస్వాములు కాదా! ఎందుకో ఇంత అన్యాయము." అని నేను ఒంటిగా కూర్చునప్పుడల్లా ఆలోచిస్తూ వుండేదాన్ని.

కట్నంలేని పెళ్లి

సరే శలవలు అయిపోగానే మా నాన్నగారు నన్ను కాలేజీలో యఫ్. యే. లో చేర్పించారు. నేను పట్టుదలగా చదివేదాన్ని. అన్ని సబ్జక్టులలోను మొదటి మార్కు నే తెచ్చుకునే దాన్ని. నా క్లాసు మొగ పిల్లలందరు నాతో పరిచయము చేసుకుందుకు వుబలాట పడేవారు. కాని వారికి అటువంటి అవకాశము ఇవ్వకుండా వుండేదాన్ని. ఇట్లావుండగా ఒక రోజుని మా క్లాసు మానేటరగు పరశు రామశర్మ నా దగ్గరికివచ్చి 'ఏమండీ మీరు ఇవ్వేళ మీటింగ్‌లో మాట్లాడాలి, మాట్లాడవలసిన విషయము 'స్త్రీ విద్య' అని చెప్పేడు. ఫస్టు మార్కు తెచ్చుకుందుకు ప్రతి పరీక్షలోను ఈ అబ్బాయి నాతో పోటీపడుతుంటాడు. ఒక మార్కో రెండు మార్కులో తేడాగా నాకే వచ్చేది. ఫస్టుమార్కు... 'మీరుకూడా మాట్లాడు తున్నారా' అన్నాను, అవునండీ మాట్లాడుతాను అన్నాడు. ఆలోచించ కుండానే నా అంగీకారమునుకూడా తెలిపేను. చాలామంది ఆ మీటింగ్‌లో మాట్లాడేరు. కొందరు స్త్రీకి విద్య అనవసర మని, మరి కొందరు అవసరమని వివిధ రీతులుగా మాట్లా డేరు. మానేటరు పరశురామశర్మ ఇట్లా మాట్లాడేడు "స్త్రీకి విద్య చాలా అనవసరము. ఎందు కంటే స్త్రీ బాగా చదువు కున్నదైతే, ఇతర ముఖ్యమైన పనులన్నీ మానేసి అస్తమా నము నవలలు నాటకాలు చదువుతూ కూర్చుంటుంది. తన కాలమంతా వ్యర్థమగు నవలలు చదవడముతోనే వినియో గిస్తుంది. ఈ పాడు చదువు లేకపోతే ఎంతైనా మంచివన్నీ నేర్చుకుని సంసారాన్ని దిద్దుకొనుచు పొదుపుగా భయభక్తు లతో అణగి మణగివుంటుంది. ఈ విద్యవలననే చాలామంది స్త్రీలు చాలామటుకు పాడైపోతున్నారు' అని ఇంకా ఇట్లాటిదే ఏదో గొణిగాడు. అతడు మాట్లాడిన దానిలో ముఖ్యముగా నేను గ్రహించినది ఈ వక్కటే. తరువాత నేను మాట్లాడవలసివచ్చినది. ఏం మాట్లాడను. అతను మాట్లాడినది వినే సరికి నాకు వళ్లు భలే మండింది. చదువు కున్న ఆడవాళ్లను గురించి ఆ విధంగా మాట్లాడడం నా కేమీ నచ్చలేదు. నవలలు చదువుకున్న స్త్రీలు చదువు కుంటూ ఇంట్లోనే వుంటారు. చదువుకోని స్త్రీలు ఇరుగు పొరుగు వారితో మాటలతో కాలక్షేపం చేస్తూ అనవసర మైన ఘర్షణలు తెచ్చుకుంటూవుంటారు. అసలు మనిషి అన్నాక ఏదో విధంగా కాలక్షేపము చేయాలి కదా! చదువుకున్నదైతే ప్రపంచ పరిస్థితి ఏరోజుకారోజు తెలుసు కుంటూ, ఏవైనా కష్టాలు తనకి సంభవిస్తే తనఒక్కర్తికే కాదనియు, తనకంటే ఎక్కువ కష్టపడే స్త్రీలు ఈ ప్రపంచములో నున్నారనియు తెలుసుకొని తనకష్టములను సంతోషపూర్వకముగా భరిస్తుంది. స్త్రీకే విద్య లేకపోతే, స్వతంత్రశక్తి లేనిదై ఇతరులమీద పూర్తిగా ఆధారపడవలసి వస్తుంది. ఏకారణమువలనగాని వారు తన భారమును మోయుట కంగీకరించనిచో, తాను ఏనుయ్యో, గొయ్యో చూచుకుని తన భారాన్ని ఇతరులమీద లేకుండా చేస్తుంది. ఉదాహరణకు ఆడ పిల్ల పెండ్లి విషయమై చూడండి— తల్లిదండ్రులు ఏ విధముగా తహ తహలాడు తార్తో! కొన్ని వేలు కట్నము ఇస్తే తప్ప మంచి సంబంధము దొరకదు. దొరికి నప్పటికీ వారు చెప్పిన షరతులన్నిటీ వప్పుకొని ఎంతో భయపడుతూ వుంటారు. ఏ విషయములో చూచినా స్త్రీకి అన్యాయమే జరుగుతూవున్నది. అవసరమైనప్పుడు తన విద్య నుపయోగించి స్వతంత్ర శక్తివలన జీవించగలిగే సామర్థ్యము స్త్రీకి తప్పకవుండవలయు'నని నా వుపన్యా సాన్ని ముగించేను. ఆ వేళ వినిన అతని వుపన్యాసమువలన తప్ప పరశురామశర్మకు అటువంటి వుద్దేశాలు స్త్రీ విద్యపై వున్నట్లునాకు తెలియనే తెలియదు. నేను యఫ్. యే. పాస్ అయినాను. పరశురామశర్మ కూడా పాస్ అయి నాడు. మళ్లీ బి.యే. లోకూడా ఇద్దరం క్లాసు మేట్సుమే అయినాము. అప్పుడప్పుడతను ఎందుకో ఒకందుకు పుస్తక మనో లేక నోట్సు అనో వంకెట్టుకుని నన్ను అస్తమానం పలకరిస్తూవుండేవాడు. నేను అంత చనువుగా మాట్లాడే దాన్నికాదు. ఏదో ముక్తసరిగా సమాధానం చెప్పివూరుకు నేదాన్ని.

నేను బి.ఏ. పూర్తి చేశాను. తర్వాత ఏమి చేయట మా అన్న సమస్యవచ్చినది. 'ఇక లాభంలేదు దాని పెండ్లి విషయమై ఆలోచించుట.' అని మా అమ్మకూడా మొండ్ కెత్తి ఆ విషయమే మాట్లాడం మా నేసింది. మా అక్క య్య వుపాధ్యాయినిగా వున్నది కనుక నేనుకూడా ఆ పనే ఎందుకనుకున్నాను. తర్వాత మానాన్నగారి స్నేహితులు కొందరు ప్లీడరీ పరీక్షకు వెడితే బాగుంటుందన్నారు.

కట్నంలేని పెళ్లి

సరే మా నాన్నగారి అంగీకారంమీద 'లా' చదివేందుకు చెన్నపట్నం వెళ్లేను. నేను హాస్టలులో వున్నాను. 'పరశురామ శర్మ యం. యే. చదివేందుకు మద్రాసు వచ్చినట్లు మా నాన్నగారు రాశారు. ఈ పరశురామ శర్మ నేను ఎక్కడికి వెడితే అక్కడికే తయారవుతున్నాడేమిటి బాబు! అయినా మా నాన్నగారు అతని సంగతెందుకూ ప్రత్యేకించి నా వుత్తరములో రాశారు? అని ఒక రోజంతా ఆలోచించాను. తర్వాత నా చదువులోపడి పోయాను. ఒక రోజు హటాత్తుగా నా కోసమెవరో విజిటరువచ్చి విజిటింగ్ రూములో కూచున్నట్లు నాకు కబురువచ్చింది. ఆడావుడిగా ఎవరా అని వెళ్లేను— పరశురామ శర్మ. "హి-హి-హి కులాసాగావున్నారండీ" అని పలకరించాడు. నా కులాసాకేమి? బాగానేవున్నా. మీ రిలావచ్చారేమిటి అన్నాను.

'ఏమీ లేదండి. మిమ్మల చూచి చాలా రోజులైంది చూచి పోదామని వచ్చాను. మీతో కొన్ని విషయాలు మాట్లాడుదామనికూడా వచ్చాను. మీకు ఇప్పుడు వీలుంటుందా' అన్నాడు.

నేను ముభావంగా, ఏ విషయాలండీ అన్నాను. దానితో చెప్ప నారంభించాడు. 'నాకు ఒక్కర్తే ఒక చెల్లెలున్నది. దాని వివాహము చేసి మా నాన్నగారు చనిపోయారు. వరుడు బియే. చదువుతూ చనిపోయాడు. మా చెల్లెలి భవిష్యత్తును తలుచుకుంటే నాకేమీ తోచుట లేదు. చదివించుదామనుకుంటున్నాను, దానికి మా అమ్మ అంగీకరించుట లేదు. మా అమ్మగారి యిష్టానుసారం దాన్ని అల్లాగే వుంచెయ్యడమా లేక మా అమ్మగారికి అయిష్టమైనా సరే మా చెల్లిని చదివించడమా అని ఆలోచిస్తున్నాను. ఈ విషయములో మీ అభిప్రాయము కూడా తెలుసుకుందామని వున్నది." అని అన్నాడు. స్వానుభవము కలిగేదాక మనుష్యులు మారరుకదా! అనుకున్నాను. "స్త్రీ విద్యనుగురించి మీకు విచిత్రమైన భావాలున్నాయనుకుంటానే, 'స్త్రీ చదువుకుంటే పాడైపోదా! అని అన్నాను. దానికి శర్మ మొదట తెల్లపోయి తర్వాత స్ఫురణకు తెచ్చుకుని, 'ఓహో, ఎప్పుడో నేను డిబేట్లో స్త్రీ విద్యనుగురించి మాట్లాడినది మీరింకా జ్ఞాపకముంచుకున్నారా! ఇప్పటి నాయభిప్రాయం స్త్రీకి తప్పక విద్యవుండాలనే. స్త్రీకి కూడా పురుషుని వలె ఆర్థిక స్వాతంత్ర్యంవుండి తీరాలి లేక పోతే ఆ జన్మాంతం ఇంకొకరిపైన ఆధారపడి, తనవ్యక్తిత్వమును కోల్పోతుంది. ఆ విధంగాలొంగి పోవుట కిష్టములేని వ్యక్తి కష్టపడుతుంది, లేదా ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంది." అన్నాడు.

నాకొంతవరకు శర్మ మాట్లాడినది సమంజసముగానే కనిపించినది. తనకు స్వానుభవమేదో కలిగివుండుట వలన ఈ విధంగా మారేడనుకున్నాను. 'సరే! మీ అభిప్రాయాలు నా అభిప్రాయాలు ఏకీభవించాయి. తప్పకుండా మీ చెల్లెలిని ప్రైవేటుగా బెనారెస్ మెట్రిక్‌కు పంపండి. త్వరగా అయిపోతుంది. సులభంకూడాను. అదైన తర్వాత ఆలోచిద్దా' మన్నాను.

ప్రతి శని ఆదివారాలలోను శర్మ మా హాస్టలుకు వస్తూ వుండేవాడు. మొదట అతనిరాక అట్టేనాకు ఇష్టముండేది కాదు. గాని తర్వాత తర్వాత అతను రావడము మామూలు అయి పోయినది. వచ్చినప్పుడల్లా అతను నేను కలిసి అనేక విషయాలపై వాదోపవాదాలు చేసుకుంటూవుండే వాళ్లం. శర్మని మా హాస్టలులో చాలామంది నా స్నేహితురాండ్రకు పరిచయముకూడా చేశాను. అప్పుడప్పుడు మేమంతాకలిసి బీచికికూడా వెడుతూవుండేవాళ్లము.

చూస్తుండగానే రెండేళ్లుగడిచి పోయాయి. నేను యఫ్.యల్. బి.యల్. కూడా పూర్తి చేశాను. శలవలకు ఇంటికి వెళ్లేను. 'చదువంతా పూర్తియింది ఇంకనేమి చేయదలచుకున్నావు తల్లీ!' అని మానాన్నగారు అడిగేరు. చదువు పూర్తయాక అంతా ఏమి చేస్తారో నేనూ అదే చేస్తా. అన్నాను. అయితే మద్రాసులో ప్రాక్టీసు పెడ్తావమ్మా అన్నారు నాన్ననవ్వుతూ. 'ఇక చాల్లెండి నవ్విపోతారెవరైనా వింటే ఆడు పిల్లేమిటి ప్లీడరీ చెయ్యడమేమిటి; దానికింక పెళ్లి పేరంటం అవసరము లేదాయేమిటి! అన్నది అమ్మ. 'అవసరము లేదని నేనుటుకు అన్నానా, వరుడు సిద్ధంగానే వున్నాడు. వేరే వెతకనవసరములేదు, నా పట్టుదల ప్రకారం నేను దమ్మిడీ కట్నం

కూడా ఇవ్వనవసరము లేదు. అన్నారు నాన్న నాకేసి చూస్తూ, నవ్వుతూ! నాన్న మాటలు నాకేమీ బోధపడ లేదు. అంత సిద్ధంగా వున్నవరు డెవరా అనుకున్నాను.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలయాక నాన్న ఒక చిన్న వుత్తరాల కట్ట ఒకటి తెచ్చినాముందు పడేసి చదవ మన్నారు. ఆదస్తూరిచూస్తే శర్మదిలాగ కనిపించింది. ఇదేమిటా అని ఆశ్చర్య పోతూవిప్పేనుకట్ట. ఒక్కొక్కటి చదువుతుంటేనాకు కోపము ఆశ్చర్యము కలిగేయి - ఆఖరి వుత్తరములోని సారాంశమేమిటంటే శర్మనన్ను వివాహము చేసుకుందుకు తనకేలాటి అభ్యంతరమూ లేదనియు, నా అంగీకారమును కూడా తెలుసుకుని వ్రాయమనియు వున్నది. 'నాన్నా శర్మ ఈ విధంగా వ్రాయుటకు కారణమేమి? నీవే ముందు ఏదో అతనికి వ్రాసివుంటావు. నా యిష్టమును తెలుసుకోకుండా ఎందుకు అల్లారాశావు?' అన్నాను. అయితే సరే ఇప్పుడతనికీ ఏమని రాయ మన్నావు. యస్ అని రాయమన్నావా, నో, అని రాయమన్నావా? అన్నారు నాన్న. నేను ఏమీ చెప్పలేక పూరుకున్నా. మౌనం అర్థాంగీకారం కనుక అతనికి ఇప్పుడే నీ అంగీకారము తెల్పుతూ రాస్తున్నానమ్మా అన్నారు. ఆ శెలవలలో మా వివాహమైనది.

నేను ప్రాక్టీసు పెట్టేను. శర్మకు ప్రసిడెన్సీకాలేజీలో లెక్చెరరు పని అయింది. నాన్నమమ్మల చూచి సంతోషిస్తూవుంటారు. అమ్మకూడా కట్నం లేని పెండ్లే బాగున్నది. అంటుంది. అక్కయ్య మాత్రం వుద్యోగరీత్యా ఆ వూరు ఆ వూరు తిరుగుతూవున్నది. నా వివాహం తలుచుకుని ఇప్పటికీ నేను ఆశ్చర్య పడుతుంటాను.

నర్సరీస్కూలు ఉపాధ్యాయుల తర్ఫీదులకు

బృందావన ట్రయినింగ్ పాఠశాల

బాలోద్యానవన పాఠశాల మైలాపూర్, మదరాసు.

ఇందు సెకండరీ శాఖలో స్కూలుఫైనలు పాస్ అయినవారును ప్రాథమిక శాఖలో, మూడవఫారమ్‌గాని, ఎనిమిదవ తరగతిగాని పాస్ అయినవారును జేర్చుకొనబడుదురు. ఇందుకూడా సాధారణ ఉపాధ్యాయ ట్రయినింగ్ ముగించినవారికి ఈ తర్ఫీదు ఒక సంవత్సరము. తదితరులకు రెండు సంవత్సరములు ఏర్పాటు చేయబడినది. తర్ఫీదనంతరము వీరు గవర్నమెంటు పరీక్షకు పంపబడుదురు.

బోధన తెలుగులో, అరవములోనూ జరుగును. తెలుగు యువతులకు ఉచిత వేతనములు ఏర్పాటుచేయబడును.

ఈ సదవకాశమును పురస్కరించుకోదలచిన ఆంధ్ర యువతులు, వివరములకు ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

డాక్టర్. వి. ఎన్. శర్మ

ప్రిన్సిపాల్

బాలోద్యానవనము, ఎడ్వర్డ్ ఎలియట్సు రోడ్డు, మైలాపూర్.

గానకళ

శ్రీమతి ద్వారక పార్థసారధిగారు,

సంగీతం సర్వజనాహ్లాదకరమైనది. లలిత కళలలో ఒకటి. సంగీతములోని మహిమాతిశయాన్ని గుర్తించడానికి మనకు త్యాగయ్య కీర్తనలు, జయదేవుని అష్టపదులు, నారాయణ తీర్థుల తరంగాలు ఎన్నో వున్నవి. అలాగే శ్రీ వీరేశలింగం గారుకూడా బ్రహ్మసమాజం ప్రార్థనలకోసం అనేక కీర్తనలు రచింప జేశారు. కొన్నిటిని ఆయన రచించారుకూడా. ఇటీవల మదరాసులో జరిగిన శ్రీ వీరేశలింగం కవి శతవార్షికోత్సవాల సందర్భాన శ్రీమతి ద్వారక పార్థసారథిగారు 'గానకళ'ను గురించి ఇచ్చిన ఉపన్యాసమే ఈ వ్యాసం. —సంపాదకురాలు

ఏపని చేయుచున్నను వ్యక్తి నోట్లో సాధారణముగా ఏదోనొక మెట్టును గొణుగుకొనుచుండును. అది శాస్త్రీయముకాని అశాస్త్రీయము కాని, అతనికి తెలియకుండా పరధ్యానములో కూడా పాడుకొనుచుండుట మనమెరుంగుదుము. ఆ గొణుగుకొను మెట్టుకే కొన్ని తనకు తోచిన అక్షరములనో కొన్ని పదములనో ఉచ్చరించుచు తన భావమును ఆ మెట్టు గుండా వెల్లడించును.

మాయింట్లో మా పెద్ద పాపాయి రాత్రి ఏడు గంటలకి నిద్రపోవును. ఆసమయమున వాళ్ల నాయన యింటికి వస్తారు మాపాపాయికి వాడి నిద్రసమయములో మేము మాట్లాడితే కోపము వచ్చి చికాకు పడును. దానివల్ల మేమిద్దరం కలిసి పాడు జోలపాట జోలపాట మెట్టులోనే మావారు బయట జరిగిన సంగతులు అన్నియు ఆ మెట్టులో పాడుతారు. మా పాపాయికి జోలపాట పాడినట్లు ఉండాలి. నాకు బయటి సంగతులు చెప్పినట్లు ఉండాలి. ఇలాగే ఎన్నో కుటుంబాలలో జరుగుతుంటాయి. కొన్ని చోట్ల జోలపాట పాడుతూ ఇంటిలో ఎవరిమీదైనా కోపముంటే వారిని నిందించుతూ ఆ మెట్టులలో పాడడం కద్దు. పెండ్లి పాటలని, వియ్యాంకుల వారి పాటలని పేరుపెట్టి పాటలలో వియపురాండ్ర మీద కొన్ని కొన్ని అసందర్భ వాక్యాలను ఇమిడ్చి పాడడం ఆచారం కనుక ఇటువంటి ప్రసిద్ధపు మెట్లు ఉన్నా కాలాన్ని బట్టి పరిస్థితులనుబట్టి సాహిత్యం మారి పోతుంది. ఇటువంటివే జానపద గీతాలు.

కవిత్వానికి సంగీతము (లేక గాన మందారాం) ఆది అని చెప్పవచ్చును. కొంత గానము కొంత లయ మనుష్యునియందు పుట్టుకతో ఉండబట్టి మనుష్యునికి కవిత్వధోరణి జనించినదని చెప్పవచ్చును.

మనలోని హృదయము లయ ప్రకారము కొట్టుకొనును. మనదేహమందు ప్రవహించు రక్తము లయ ప్రకారము ప్రవహించును. ప్రపంచము, ప్రకృతి అన్నియు లయ. ఇక గానమా? చిన్న చిన్న సెలయేళ్లు ప్రవహించుచు చేయు శబ్దము గానము. చెట్లఆకులు, కొమ్మలు మధ్యనుండి దొరచు కొన్ని వీచుగాలియొక్క శబ్దము గానము. వెదుళ్లలో కొన్ని కొన్ని క్రిమికీట కాదులు రంధ్రములు చేయ ఆరంధ్రములలో నుండిగాలి వీచినప్పుడు స్వరములు పలికినవని, ప్రాచీనులైన అడవి జాతులవారి చెవులకు ఈశబ్దములు ఇంపుగా ఉండినవనీ వీనిని అనుకరించడం కొరకు వారు ఆవెదుళ్లను చిన్న చిన్న ముక్కలుగానోలేక పెద్దవిగానో తీసుకొని, వాటికి కొన్ని రంధ్రముల జేసి నోటితో గాలిని ఊది, ఆ స్వరముల వాయించి గానము చేసిరనీ తెలుస్తున్నది. దాని ద్వారా వేణువాద్యము ఆరంభమయినదని తెలియచున్నది. కనుక ప్రకృతి యందే లయ గానము గలదు. ఈ రెంటి సమ్మేళ

నలో వ్యక్తియొక్క మెదడు పూర్ణముగావృద్ధి పొంది, కవిత్వము, వాఙ్మయము, సంగీతము, శిల్పము, నాట్యము, మొదలగు కళలకు పునాదియైనది.

అన్ని కళలు ఒకదానితో నొకటి మిళితమైయున్నవి. వాఙ్మయములో కవిత్వం, కవిత్వంలో సంగీతం, సంగీతంలో కవిత్వం, సంగీతంలో నాట్యం, నాట్యంలో సంగీతం ఇలాగ ఒక దానిలో నొకటి పెనవేసుకొని యుండును.

సంగీతము : సంగీతములో వాఙ్మయము కలదు. రామాయణమును కుశలవులు పాడినట్లు ప్రతీతి. ఇప్పటి యుగపు మాట చెప్పదలంచుకుంటే రామాయణ మంతటిని త్యాగయ్య తన కృతులలో ఇమిడ్చినాడు.

ఉదా : బడలికదీర. రీతిగౌళ—ఆది.

ఎవరో రామాయణమును "కట్టి, కొట్టి, తెచ్చి "నను మూడు మాటలలో చెప్పారని అంటారే, అలాగే ఈ కృతిలో త్యాగయ్య రామాయణమంతయు చెప్పినాడు.

బడలిక దీర పల్కరింపవే
సడలని దురితమ్మును తెగకోసి
సార్వభౌమ సాకేతరామ ।
పంక జాసనుని పరితాపముగని
పంకజాప్త కులపతియై వెలసి
పంకజాక్షితో వనమునకేగి
జింకను వధయించి
మంకు రావణుని మదముల నణచి ని
శ్శంకుడగు విభీషణునికి బంగారు
లంకనొసగి సురలబ్రోచిన నిష్క
ళంక త్యాగరాజుని హృదయమున ॥

చరణములో ఒక్కొక్క పాదారంభమున ॥౦క॥ అని వచ్చును. కడపటివరకు, పంకజాసనుని పంకజాప్తకుల, పంకజాక్షితో జింకను మంకురావణుని, లంకనొసగి, నిష్కళంక మొదలగునవి అప్రాసమునకు సరిగ్గా వచ్చుచున్నవి. ఇటువంటి వ్యాకరణ పద్ధతులు అన్ని కృతులలో పాటింపబడినవి. ఇది కవనము గాక మరి ఏమగును ?

కుశలవులు పాడిన రామాయణమును వాల్మీకి కావ్యంగా పాడెను. వాల్మీకి కావ్యంగా పాడిన రామాయణమును త్యాగయ్య కృతులుగా పాడెను. త్యాగయ్య కీర్తనలు కర్ణాటక సంగీతానికి మకుటములు. వాటిమూలంగానే సంగీతమునకు శ్రావ్యగానమును అభిలషించే సర్వప్రపంచములోను ప్రశస్తి కలిగినది. త్యాగయ్య తెలుగు వాడు. అతని కీర్తనలు తెలుగులో. మరి సంగీతానికి తెలుగువారు గురువులు కారా ? కూనిరాగాలు తీసుకొన్న తెలుగువారిలోని అదిమ జనుల నుంచి త్యాగయ్యవరకు తెలుగుసంగీతం రగడలు ఏలపాటలతో ఆరంభమయి యక్షగానాల ద్వారా అభివృద్ధి పొంది మువ్వగోపాలాదులచే మెరుగు పెట్టబడి త్యాగయ్యతో ఫలించినది. ఆచరిత్రంతా ఇక్కడ అప్రస్తుతం.

ఇక వాఙ్మయములో సంగీతమా ? వాఙ్మయమంతయు సంగీతమనే చెప్పవచ్చును. శతకములు కొన్నిటిని స్త్రీలు స్త్రీలపాటగా పాడుకుంటారు.

ఉదాహరణకి నారాయణశతకము తీసుకోండి. దీనిని మన వారు స్త్రీల పాటగా:

1. ఒకటు పరిశుద్ధి లేక నాజన్మమకట వ్యర్థం బాయెనూ అకలంకమగు మార్గము జూపగదె సకలేశ నారాయణ.

2. వేగులేచినది మొదలు సంసార సాగరంబున నీదుచు నీగుణంబొకవేళనూ తలపగదె యెంచు నారాయణ.

3. చింతా పరం పరలచే చిత్తంబు చీకాకు పడుచున్నదీ సంతోషమున జేర్చవే ముక్తిప్రపంచమును నారాయణ.

పల్నాటివీరచరిత్ర ద్విపదలో వ్రాయబడినది. ఇదీ పాటే.

కాశేటి రక్తాన్ని కలగలపుజేసి
పట్టించియుంచుతా పానకంబునకు
తలకు బోసుకోనండి తానమాడండో

మన పల్లెలలో రోటిదగ్గర దంపుళ్లవాళ్లు పాడేపాటలు సాధారణంగా ద్విపదలు. ఇవీ పాటలే. బొబ్బిలియుద్ధపుగాథ ద్విపద.

" ఫెళ్లుఫెళ్లున పేల్చినారుగా పిరంగులైతేనూ
వెనుకతట్టుగా ఉన్నాడండి హైదర్ జంగోజీ
జయించలేము జయించలేము రంగారాయుణ్ణీ
అయిదు పుట్ల నల్లమందు కావులు పరాచీకి
భూమి మీద పరపించినాడుగా మందులుఅయితేను

ఇటువంటివి ఎన్నో కలవు. అన్నియు సంగీతములో మేళవించినవే. స్త్రీ సమస్యప్రభోదానికి ద్విపదను శ్రీ వీరేశలింగంగారు విస్తారంగా వాడినారని అనడం మనం నేడు స్మరించదగిన విషయము.

కందపద్యము ఆదితాళమునకు సరిపోవును. చంపక ఉత్పల మాలికలు త్రిపుట తాళమునకు సరిపోవును. ఇట్లు కవిత్వమునూ సంగీత బద్ధము.

వసుచరిత్ర తెలుగు భాషలో అతిప్రౌఢ కావ్యము. అది పద్యపద్యము సంగీతమే. ప్రత్యేకము తన సంగీతసామర్థ్యమును కనపర్చడానికే కవి ప్రతి పద్యంలోనూ రాగమును సూచిస్తూ వ్రాసినాడను వాదమును కలదు. ఇట్లు కావ్యమంతా సంగీతముగా వ్రాసిన ప్రతిభ తెలుగు కవికే చెందింది.

త్యాగయ్య కృతులను పోలిన సులభశైలిలో బ్రహ్మసమాజము వారిలో కొందరు వాగ్గేయ కారులు సుమారు మూడు వందల ధ్యానగీతములు రచించియున్నారు. ఈ గీతలకు రాగములు తాళములు పేర్కొనబడినవి. కొన్ని త్యాగయ్యగారి దివ్యనామ సంకీర్తనల బోలియున్నవి అనగా పల్లవియు తక్కినవి కొన్ని చరణములు, లేక పల్లవి అనుపల్లవి ఈరెంటి మెట్టుతోనే చరణములు. శైలిచాల సరళముగానున్నది. ఈ కీర్తనలను చక్కటి సంగీత సంకేతముతో వ్రాసి ప్రచురించితే అందరికి ఉపయోగముగా ఒకే మెట్టులో శాశ్వతముగా ఉంటుంది. ఈ కీర్తనలు సాధారణముగా వాడుకలలోనుండే భైరవి, కళ్యాణి, కాంభోజి, మాయామాళవగౌళము మొదలగు రాగాలలోనే రచింపబడినవి. ఈ కీర్తనల పక్కికి త్యాగయ్య రచనలే పునాదని స్పష్టముగా తెలుసుకొనవచ్చును. త్యాగయ్య రాగముయొక్క స్వరూపములలోనూ భావవ్యాప్తిలోనూ, అన్ని విషయములలోను ఇంకొకరు క్రొత్తగా ఏకొంచెమును కనిపెట్టలేనంతగా అన్ని విషయములలోను పూర్తిగా గాలించి వేసియున్నారు. ఈ బ్రహ్మసమాజ కీర్తనలకు శ్రీ వీరేశలింగంగారే ప్రధాన కారకుడని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ఆస్తిక మతం ఆస్తిక సంగీతం ఆయనకు ప్రాణ ప్రదములు.

WOMEN ADMIRE.. MEN Respect



KESRINE

KEEPS HAIR HEALTHY & HANDSOME

VICTORIA DEPOT, MYLAPORE, MADRAS

కేశ్ రీన్ హేరాయిల్, కేశ్ రీన్ షాంపూ, ఈరెండు విడువక వాడిన కేశములు అందముగాను, దట్టముగాను, చాలా ఆకర్షణీయముగా పెరుగును ఒక్కొక్కటి వెల 0-12-0 రెండూచేరి పోస్టేజీతో సహా రూ. 2-2-0.

విక్టోరియా డిపో,
మైలాపూరు, మద్రాసు 4,

ఏ. ఎం. అబ్దుల్లా

స్మార్ట్ టైలరింగ్ హౌస్

వెన్వెంటనే తయారుచేసి అందించుటకు, అధికమైన సంతృప్తికి పూచీపడుటకు నవీనమైన మాదిరులలో పనితనమునకు పేరెన్నిక గన్నది.

ఒకసారి ఆర్డరిచ్చి చూసినచో వస్త్రధారణమున ఎంతటి విపరీతమైన అభిరుచులు కలవారికైనా మేము తృప్తినీయగలమని గ్రహించగలరు.

ఒకసారి వచ్చి చూడండి
16. కచ్చేరిరోడ్, మైలాపూర్,
మదరాసు 4.

నైజాం ప్రజాపోరాటంలో స్త్రీల బాధ్యత

శ్రీమతి మంత్రి లక్ష్మీప్రసూనాంబగారు

భారత దేశములోవున్న ఆరువందల సంస్థానములన్నిటిలోను హైదరాబాదు సంస్థానము పెద్దది. నిజాము సంస్థానములోనూటికి తొంబది అయిదు మంది హిందువులు. నిజాము సంస్థానములో పెట్టుబడిదారీ జాగీర్దారీ విధానం బాగా అమలులోయున్నది. హైదరాబాదు సంస్థానములో ప్రజలను మొదటనుండియు అనేక బాధలు పెట్టుచుండెడివారు. ప్రధానంగా వెట్టిచాకిరి, లంచాలు, దౌర్జన్యాలు, యితర జమీందారీ దోపిడి మొదలగునవి యన్నియు జరుపుచుండెడివారు. సాయుధ రౌడీదళాలు, రిజర్వుదళాలు గ్రామాలకు జమీందారీమురా అంగరక్షకులుగా వచ్చి ప్రజలపై తీవ్రమైన హింసాకాండ జరుపుచుండెడివి. ప్రజలను జమీందారీ నరకకూపములోపడద్రోయుటానికి రాజులు, యువరాజులు, ప్రధాన మంత్రులు, అధికార్లు యింకా యీ అమానుష చర్యలను ప్రోత్సహించుచునే యున్నారు.

జిల్లాలలోని దేశముఖులు రైతులనుండి వేలయకరాల భూమి నాక్రమించి కూలీలుగా చేసి తినుటకు పట్టెడన్నమైన లేకుండ చేయుచుండెడివారు. ఈ దురాక్రమణ ఫలితంగా పేద రైతులు, వ్యవసాయ కూలీలైనవారు ప్రతి గ్రామంలోను 95% వరకున్నారు వారుతాము పండించిన పంటను దేశముఖులయిండ్లకు చేర్చి తిండి లేక అనుదినం కరువు కాటకాలకు లోనౌతుండేవారు. నైజాము నవాబు ప్రజలకు విద్యా విషయము లేవియుచూడక పోవుటయేగాక ప్రజలపై ఎంత దారుణహింసా కాండ జరిగినప్పటికిని జోక్యం కలుగ జేసుకొనేవాడుగాదు.

బ్రిటిషు సామ్రాజ్యవాదుల చేతులలో కీలుబొమ్మలైన సంస్థానాధి పతుల మూలముననే భరత దేశములో యింత అరాచకస్థితియేర్పడినది. సామ్రాజ్యవాదుల చెప్పుచేతలలోమెలగెడి సంస్థానాధిపతులు ప్రజల సదుపదేశమును పాటింపక దేశమంతయూ మత విద్వేషములను రెచ్చగొట్టి అల్లకల్లోలము చేయుచున్నారు. హైదరాబాదు సంస్థానాధీశుడు ప్రజా సౌఖ్యమును కోరక తన నిరంకుశ పరిపాలనను సాగించుతూ వుండేవాడు. ఆంగ్లో, అమెరికన్ సామ్రాజ్యవాదులు సంస్థానాధీశుల చెవులలో కపట ఉపదేశము చేసి భారత దేశమంతయు అల్లరులను రేకెత్తించి భారత దేశాధికారము మధ్యవర్తితనంగా స్వీకరించి తమ అధికారమును చెలాయించుటకు అనేక కుట్రలను పన్నుచున్నారు. సంస్థానాధీశులు యీకపటయోగులమాయను గ్రహించ లేక భారత దేశమును హింసాకాండకు గురిచేయుచున్నారు.

ఎన్ని సంవత్సరములనుండో దాస్యశృంఖలములలో బంధింబడిన భారత దేశము ఆగష్టు పదిహేనవతేదీన బంధవిముక్తి పొందినది. భారత దేశమంతయు స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపబడినాయి. భారత దేశము రెండు అధినివేశాలుగా విభజంపబడినది. సంస్థానములన్నియు వీలైనటువంటిదానిలో (ఒక అధినివేశము) చేరవచ్చునని ప్రభుత్వమువారు ప్రకటించినారు. ఆవకాశమును బట్టికొద్ది సంస్థానములు మాత్రము ఏదో ఒక అధినివేశములో చేరినవి. కాని యెక్కువ సంస్థానములు సర్వస్వాతంత్ర్యమును ప్రకటించినాయి. తరువాతకొన్ని ప్రజాందోళనచే చేరినవి కాని నిజాం సంస్థానము మాత్రము ఎందులోను చేరలేదు.

చేరటమా చేరకపోవటమాయని యూనియన్ ప్రభుత్వము అనేక సారులు మందలించినది. నైజాం సామ్రాజ్యవాదుల కుట్రఫలితంగా యూనియన్ ప్రభుత్వములో చేరక ప్రజలపై నిషేధాజ్ఞలు హింసాకాండ ప్రారంభించాడు. ప్రజలుపది, పదిహేను సంవత్సరాలుగా పోరాడినది జమీందారీ, పెట్టుబడిదారీ మొదలగు విషయములకై కాని నేడుఎన్ని సంవత్సరాలుగానో ప్రజల హృదయాలలో దాగియున్న స్వాతంత్ర్యపిపాస ఒక్కసారిగా ప్రజ్వరిల్లినది. ప్రజాపోరాటం ప్రారంభమైనది మొదలుగా తెలంగాణా ప్రజయంతయు సత్యాగ్రహము మొదలిడినారు. వేలకొలది ప్రజలునాయ

కులు ప్రభుత్వ నిషేధాజ్ఞల నుల్లంఘించినందుకు నిర్బంధింపబడ్డారు. వేలకొలది ప్రజలుగుండాల యొక్క దారుణ హింసాకాండకు గురిఅయ్యారు. వందలకొలది ప్రజ తెలంగాణా భూమికి తమ ఆత్మబలిదానం చేసారు. లక్షలాది స్త్రీలు నానా అసహ్యకరమగుదారుణ హింసాకాండకు పాల్పడ్డారు. నైజాము నవాబు సాగించే కిరాతక పరిపాలనను ప్రజలు అసమానమైన ధైర్యసాహసాలతో ప్రతిఘటిస్తున్నారు. నైజాము రాజ్యములో ఎంతరాక్షసకృత్యాలు జరుపుచున్నప్పటికి ప్రజా వుద్యమము మాత్రము వీరోచితంగా కొనసాగినది. అపార శక్తి సామర్థ్యములతో ప్రజాపోరాటం సాగుతూవుండగా మహోన్నతవహించినట్టి వల్లభాయి పటేలుగారు తనచాకచక్య నైపుణ్యముల చేత నైజాంయనెడి ఒక వవ్యమృగాన్ని అడవియంతయు సంచరించకుండ ఒక బోనులాంటి హద్దులో అలసట వచ్చునంతవరకు సంచరించునట్లుగా ఒక రాజీ కుదిర్చారు. ఈ రాజీ వలన కేవలము హింసాకాండ జరుపుటకు గాక, కొంత మేలుచేయదలచియే చేసినారు. ఈ రాజీ వలనకొద్దిలాభము మాత్రముగలిగినది. ఈ రాజీవలన విదేశములనుండి ఆ యుధములు, మందుగుండు సామాను యూనియన్ ప్రభుత్వమునకు తెలియకుండ సప్లయి చేసుకొనుటకు వీలు లేదు. విదేశములనుండి ఆయుధములు మందుగుండు సామాను తెచ్చుకొనుటకు స్టెర్లింగు నిల్వల వలనగాని, లేక బంగారమును యిచ్చినపుడు గాని తప్ప మరొక విధంగా వీలులేదు. నైజాము నవాబువద్ద స్టెర్లింగు నిల్వలులేవు. ఒకచోబంగారమునిచ్చి తెచ్చుకొనుననే అనుమానం కలగడానికి వీలులేదు. కారణము యిండియన్ యూనియన్ మీదుగాగాని విమానాలు పోలేవు. విమానములన్నియు విమానాశ్రయము లోదిగనిదే పోవుటకువీలులేదు. మన ప్రభుత్వముద్వారా అవియన్నియు చకింగు చేయనిదే పోనీయరు. ఈ విధముగ యివి తెచ్చుకొనుటకు అనేక యిబ్బందులున్నవి. విదేశములలో భారతీయ యేజంట్లను వుంచుటకు మాత్రము హక్కు గలదు. ఈ రాజీవలన నైజాము నవాబు విచ్చలవిడిగ అన్ని దేశములనుండి ఆయుధములు మొదలగునవియన్నియు తెచ్చుకొనుటకు వీలు లేదు. మందుగుండు సామానుకు మొలగునవి యేవియైనను కావలసినచో యూనియన్ ప్రభుత్వమునకు తెలియజేయవలెను. యూనియన్ ప్రభుత్వము యిటువంటి సామగ్రి యేదియైనను సప్లయి చేసినచో దేశములో అరాచకస్థితి అధికమగునని యేమాత్రము సప్లయి చేయదు. ఈ రాజీకుదుర్చుటవలన యిటువంటివి కొన్ని లాభములుకలిగినవి. నైజాము నవాబుకు హద్దుగీచినప్పటికిని యింకను గమనించ లేక విచ్చల విడిగా హద్దులోనే సంచరించుచున్నాడు. ప్రజలకు అతి ప్రధానమైన రెండు కోర్కెలను తిరస్కరించుటయేగాక రాజ్యాంగ సంస్కరణలపేర పచ్చి ఫాసిష్టు ఇత్తిహాదుల్ మీన్ దురహంకారులను మంత్రి వర్గానికెక్కించినాడు. తన రాజ్యములోని ప్రజలనుకాపాడక పోవటమేగాక ప్రజలను నానాహింసలకులోను చేయుచున్నాడు. బాధ్యతా యుత ప్రభుత్వము ఏర్పాటు చేయనందున ప్రజలు యింకను పోరాడ వలసివచ్చినది. హైదరాబాదుప్రభుత్వము నేడవలంబిచుతూవున్న ఫాసిష్టు పద్ధతులవల్లనేమి, లేక అదిసాగిస్తూవున్న భయంకర ఘాతుక చర్యలవల్లనేమి, తానిక ప్రభుత్వాన్ని కొనసాగించుకొనటానికి ఉన్న నైతికబలాన్ని పూర్తిగా జారవిడచుకొన్నది. అందువల్లనే యిట్టి ప్రభుత్వాన్ని అడుగడుగునా తమ పరిపూర్ణ శక్తిసామర్థ్యములుపయోగించి, ఎదిరించి, యీనిరంకుశ ప్రభుత్వాన్ని చిన్నాభిన్నం చేసేన్యాయమైన అధికారము ప్రజలకువున్నది.

అటువంటి హక్కునుపయోగించి ప్రభుత్వాన్ని గద్దెనుండి దించటానికి కార్యాచరణసమితి యిదివరకే గత 5 మాసాలలోను చర్యలు జరుపుతున్నది. నైజాముగుండాలు యిప్పుడు చేయు కిరాతక చర్యలు మహాఘోరముగాయున్నవి.

రజకార్లు అనేక గ్రామాలను భస్మీపటలము చేసినారు. యిండ్లు తగులబెట్టుట స్త్రీలను చెరచడం, ప్రజలను చంపడం మొదలగు అనేక దురాచారములు చేయుచున్నారు. పొలములలోని ధాన్యమును దోచుకొనిపోవుట, ఇండ్లలోని అపరములు ధాన్యము సొమ్ము మొదలగువానిని లూటీలు చేయుట ఈ ఇత్తెహాదుల్ ముస్లిం గుండాల దినచర్య అయినది.

హింసాకాండ, ప్రజల ననేక బాధలు పెట్టుట మొదలగు ఘోరకృత్యములే వారికి దినకృత్యములయినవి. ప్రజలపై ఎంతదారుణ చర్యలుజరుగుచున్నప్పటికి ప్రజా పోరాటు

మిసుమంతైనా సాలోంగ లేదు. అపారధైర్య సాహసములతో ప్రజా పోరాటం దినదినాభివృద్ధి పొందుచున్నది. ఈ పోరాటాన్ని కేవలము పురుషులేగాక కొంత మంగి స్త్రీలు కూడ సాగిస్తున్నారు. మొదటినుండియు అచ్చట స్త్రీలు అవిద్యావతులైనప్పటికిని స్వాతంత్ర్యకాంక్ష పెరిగి పోవుచున్నది. మిలిటరీవారు యిండ్లను దోచుకొనుటకువచ్చు నపుడెల్ల స్త్రీలువారి శక్తి కొలది పోరాడుచు నేయున్నారు. వారు కత్తులు, ఈకెలు, బండలు, కారము మొదలగువానితో మిలటరీవారిని తరుముచున్నారు. అచ్చట స్త్రీలకు నానా విధములగు అత్యాచారములు జరుగుచున్నవి. అచ్చట మన సోదరీమణులకు జరుగు అవమానములు యావద్భారత దేశానికి కూడ కడు శోచనీయమైన పనులు. ఈ నిజాము పశుబలాన్ని నిర్మూలించుటకు యావద్భారత ప్రజానీకముకూడ ముఖ్యముగా తోడ్పడవలెను. యువకులందరు సైనిక శిక్షణపొందుచున్నారు. కాని స్త్రీలకు సైనిక శిక్షణ నిచ్చుట లేదు. స్త్రీలకుకూడ సైనిక శిక్షణయవసరము. స్త్రీలలోసగము జనాభా అబలలు, పరాధీనలు, సంరక్షణీయలు, అయితే ఆజాతికి ఒక పక్షం చచ్చుపడియున్నదన్న మాటే. చరిత్రాత్మక ప్రసిద్ధి పొందిన రుద్రమ్మదేవి, ఝాన్సీ, అహాల్యాబాయి ఇత్యాదులు రణరంగ విహారం చేసినవారున్నారు. నిన్నమొన్న బోసు సైన్యంలో కర్నల లక్ష్మీతా నుపయోగింపజాలని ఆ యుధం లేదని చెప్పి తన్ను పట్టుకున్న ఆంగ్లేయ సేనానిని హడలు గొట్టియున్నది. యుద్ధనిర్వహణలో బాహాబాహీ పోరాడటం కన్నా దాని కుపాంగాలుగా జరిగే అనేక కార్యకలాపాలలో స్త్రీలు చేయగల పను లనేకములున్నవి. కాబట్టి స్త్రీలకున్ను సైనిక శిక్షణకు యవసరము. నైజాం ప్రజా పోరాటాన్ని బలపర్చేటందుగాను స్త్రీలకుకూడ తప్పక సైనిక శిక్షణ నివ్వవలెను. యిండియన్ యూనియన్ గవర్నమెంటు ముఖ్యముగ స్త్రీల సైనిక శిక్షణకొరకు సైనిక కేంద్రాలను నిర్మించాలి. ముఖ్యముగ కృష్ణా జిల్లా స్త్రీ పురుషులందరు కలసి నిజాము కిరాతక రాజ్యాన్ని నిర్మూలించేసి ప్రజా రాజ్యాన్ని నిర్మించాలి. అచ్చట స్త్రీల అవమానములను చూచుచుండుటకిది సమయముగాదు. భారత మహిళలందరు ఈ పోరాటాన్ని బలపర్చి విజయం సాధించాలి. తెలంగాణాగడ్డకి మన రక్తాన్ని ధారపోయాలి. తృణప్రాయమైన మ ప్రాణాన్ని ధారపోసియైన నైజాం ప్రజా విజయాన్ని సాధించాలి. ఈపోరాటాన్ని అనేక విధములుగాబలపర్చాలి ప్రభుత్వోద్యోగులందరు వుద్యోగములనుండి విరమించాలి లాయర్లందరు కోర్టులకు పోకూడదు. స్కూళ్లు, ఆఫీసుల బహిష్కరించి వీలున్నంతవరకు ప్రభుత్వయంత్రాన్ని బంద చెయ్యాలి. నైజాం నవాబువద్ద యిసుమంతైనా సఖ్యత స సత్యమను వదిలేనంగున ప్రజాందోళన అధికము చేయాలి సాధ్యమయినంత త్వరలో పశుతుల్యులైన నైజాం గుండా చర్యలను దును మాడాలి. యీ సంస్థాన విషయమ యావద్భారత ప్రజానీకానికికూడ ముఖ్యమైనది. ముఖ్యము కృష్ణా జిల్లాలోని ఆంధ్ర ప్రజానీకమంతయు ప్రజాందోళ అధికము చేయాలి. భారత దేశములోని స్త్రీ పురుషులంద సమాన భావముతో తెలంగాణా ప్రజా సేవకై, ప్రజా వియానికై ముందంద వేయాలని విజ్ఞప్తి చేయుచున్నాను.

★

ఆంధ్ర మహిళ

మహిళల అభ్యుదయానికై నడుపడుతున్న
మాస పత్రిక

ప్రచురణ:
ఆంధ్ర మహిళా సభ
మైలాపూరు :: మద్రాసు
సాలు చందా: అయిదు రూపాయలు

సోషలిష్టు రష్యాలో సాంసారిక జీవనము

రష్యాలో పిల్లలకోసం కొన్ని వేల కిండరు గార్డెన్లు, బడులు, ఆటస్థలాలు, వేసవి కేంద్రాలు, శానిటోరియములు స్థాపించింది. 1946 సంవత్సరంలో రష్యా 3000000 రుబుల్సు పిల్లలకోసం వెచ్చించిందంటే దాని కృషి మనకు తేటతెల్లం అవుతుంది.

ఈ సిద్ధాంతాలు సమాజంలో మన బాధ్యత అనుసరణ యోగ్యమా? కాదా అని విజ్ఞానవంతులైన ఆంధ్ర స్త్రీలు చర్చించి, ఆ రష్యాలోని సౌఖ్యమయమైన సంసార జీవనం రుచి చూసేందుకు అకుంఠిత త్యాగబుద్ధిని ప్రదర్శించవలసి వుంది. "గృహమే కదా స్వర్గసీమ" అని గృహలక్ష్ములమని అనుకునేందుకు అనువైన పరిస్థితులు మనము కల్పించుకోవలసిన అవసరం ఎంతో వుంది. రష్యాలో పిల్లలు తల్లులు తండ్రులు పొందిన పై సౌకర్యాలు, సామ్యవాద సమాజంకోసం వారు చేసిన కృషి నాజీలపై జరిపిన పోరాటంలో చూపిన వీరత్వం త్యాగబుద్ధికి ఫలాలని గుర్తించుకుంటే మన బాధ్యత నెరవేర్చటానికి ఉత్సాహవంతులమవుతాము.

రష్యాలో పెళ్ళిళ్ళు - స్త్రీలకు సౌకర్యాలు

రష్యాలో పెళ్ళిళ్ళు యువతీయువకుల అంగీకార, అనంగీకారాలమీద ఆధారపడి జరుపబడతాయి. స్త్రీలు పురుషుల జీవితంలో తమ బాధ్యతలను నిర్వహించటానికి అనువుగాను పురుషులవలె సమాజ నిర్మాణంలో కర్తవ్యం నెరవేర్చటానికి తగ్గట్టుగా శారీరకంగా, మానసికంగా, వైజ్ఞానికంగా, రాజకీయంగా శిక్షణపొందుతారు. రష్యాలో స్త్రీలకు పురుషులవలె జీతము, విద్య, విశ్రాంతి, ఓటింగు, ఇన్సూరెన్సు వగైరా అన్ని హక్కులు అతి సులువుగా లభిస్తాయి! గర్భిణీ స్త్రీలకు పురుడుకు ముందు, వెనుకకూడా వైద్య చికిత్స విశ్రాంతి, విడిది సౌకరాలు అమర్చబడతాయి. వాళ్ళకోసం కిండరు గార్డెనులు, ప్రసవ గృహాలు, నర్సులు అందరూ పిలుపుకు అందేటట్లుగా రష్యా ఎన్నో సౌకర్యాలను సమకూర్చింది.

రష్యాలో పిల్లలపై తల్లిదండ్రులకుగల బాధ్యతలన్నీ ప్రభుత్వమే తలమీద పెట్టుకొంది. మన దేశంలో చాలామంది తల్లుల దైన్యత గమనిస్తే రష్యా తలమీద పెట్టుకొన్న మహత్తర బాధ్యత యొక్క ప్రాముఖ్యత గోచరిస్తుంది. తక్కిన ప్రభుత్వాలకు, రష్యాకు ఉన్న తేడా ఇక్కడే. రష్యాలో సంసారికజీవనం ఏ ఒక ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య జరిగే కథగాగాక ప్రభుత్వానికి చేయి చేసుకొన్నే హక్కుగల సమస్యగా నిరూపించబడింది!

★

ఆంధ్రమహిళాసభ

అన్ని తరగతులులూ ప్రారంభము ఈ నెల. 2 వ తేదీనే. విషయములు వివరములు తెలియగోరువారు ఆదివారము తక్క మిగతా రోజులలో ఆంధ్రమహిళా సభకు 2 గం॥ నుండి 5 గం॥ లోగా వచ్చి తెలిసికొనవచ్చును.

కార్యదర్శినులు

నూతన భారత రాజ్యాంగ విధానము

శ్రీమతి కె. మంగళాంబగారు ఎం. ఏ., బి. ఎల్.

గత ఆగస్టు 15 వ నాటికి భారతీయ సార్వభౌమత్వం అంతరించింది. మనం మన దాస్య శృంఖలాలని త్రెంపి వేశాము. మని ఆ స్థితికి మన హక్కు స్థిరపడిందేకాని దానిని మన మింకా భుక్తి పరుచుకోలేదు. మన స్వంత ప్రభుత్వ పద్ధతి ఏవిధంగా ఏరూపంలో ఉండాలో ఆ విషయంనిర్ధారణ చేసుకోటానికి, భారతరాజ్యాంగరచనా సంఘము అనే కమిటీని ఒకదానిని రాజ్యాంగ పరిషత్తు నియమించింది. దీనికి ప్రెసిడెంటు డా. అంబేడ్కరు. కమిటీ సభ్యులు అల్లాడి కృష్ణస్వామయ్యరు మొదలగు లోకవిదితులైన న్యాయవాదులు. ఇటీవలనే ఈ కమిటీ వారు ఒక చిత్తుముసాయిదాను ప్రచురించారు. దీనినే Draft constitution అని అంటారు.

ఈ నూతన రాజ్యాంగ విధానములోని విశేషాలు మనకంత క్రొత్తవికావు. ప్రస్తావన (Preamble) లోనే ఇండియా రాష్ట్రసమితికి (Indian union) ఒక సర్వశ్రేష్ట స్వంతంత్ర ప్రజాస్వామ్యము (Sovereign independent republic)అని నామకరణము చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యముతోను, బ్రిటనుతోను మనకు ఇక మీదట ఉండబోయే సంబంధాన్ని గురించి తర్వాత ముచ్చటిస్తామని గూడ ప్రకటనచేశారు. మన దేశ పరిస్థితులు వేరు. మన దేశం వివిధ మతాలకు జాతులకు భాషలకు పుట్టినిల్లు. ఇటువంటి దేశంలో ప్రజలేకీభావముతో ఒక్క ప్రభుత్వానికి కట్టుబడివుండాలంటే ఒక బలమైన కేంద్ర ప్రభుత్వము (Strong centre) అవసరము. హిందూదేశం ఒక బలమైన కేంద్ర ప్రభుముగల సంయుక్త రాష్ట్రము (Federal state with a strong centre) గా నుండాలని కమిటీవారి ముఖ్యోద్దేశం.

దేశంలోని కొంతభాగము పాకిస్థాన్‌గా విడిపోవుటవల్లనూ, స్వదేశ సంస్థానాలపైని బ్రిటిష్ వారి అధికారము (British paramountcy) రద్దుచేయబడుటవలనను ఈ సంయుక్త రాష్ట్రము సృజింపబడటానికి వీలుకలిగింది. కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించిన విషయాలు, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన విషయాలను వరుసగా పేర్కొని, ఇవికాక వేరు విషయములందు కేంద్ర ప్రభుత్వానికే అధికారముంటుందన్నారు. వీటినే residuary powers అని అంటారు.

ప్రస్తావనలోనే మానవుని సహజ హక్కులనుగూర్చి చర్చించారు. 18 వ శతాబ్దములో జరిగిన ఫ్రెంచి మహావిప్లవము తర్వాత స్వాతంత్ర్యము (Liberty) సర్వసమత్వము (equality,) సర్వభ్రాతృత్వము (Fraternity) గుర్తించు దేశమే ప్రజాస్వామ్య దేశమని లోకమంతటా ఈ మూడు పదాలు మారు మ్రోగినవి. ఈ సహజ మానవ హక్కులు కూడా మన రాజ్యంగ విధానములో పొందుపరచబడినవి. స్వాతంత్ర్యము, సర్వసమత్వము, సర్వ

భ్రాతృత్వము, న్యాయము ఈ నాలుగు స్థిరముగా నెలకొనుటకు కొన్ని పద్ధతులుకూడా పేర్కొనిరి.

జాతిమతకులలింగ భేదములు, విచక్షణ యుండకూడదు. వీటిపై ఉద్యోగము మొదలగు విషయములాధారపడకూడదు. తినుటకు కావలసిన తిండి, కట్టుకొనుటకు గుడ్డ లభించుటకు న్యాయమగు జీవనోపాయములను ఎవరైనను అవలంబించవచ్చును. ఉద్యోగములందు పురుషులకు స్త్రీలకు విచక్షణయుండదు. పురుషులకు స్త్రీలకు సమానమైన జీతముండును. ఇంకొకరికి ఇక్కట్టులేక వారివారి మతాలను ఆచారాలను అనుసరించవచ్చును. ప్రజలకు వారివారి అభిప్రాయములను వెల్లడించుటకు, న్యాయబద్ధులుగా గుమిగూడి రాజకీయ విషయాలను చర్చించుటకు సంపూర్ణహక్కు ఇవ్వబడింది. స్వల్పపక్షాలవారికి (minorities) దేశపరిపాలనలో పాల్గొనుటకు కూడ వీలుకలుగచేశారు. చాలా వెనుకయుండు తెగలవారికి (Backward classes) ప్రభుత్వము కొంత ప్రోత్సాహము ఇవ్వవలసినదనియు, 10 ఏండ్ల వరకే ఉద్యోగములందును, కళాశాలలందును కమ్యూనల్ రిప్రజెంటేషను ఉండవలయుననియు తీర్మానించారు. మతవిషయములందు వ్యక్తికి సంపూర్ణహక్కు ఉండాలి అనేసూత్రాన్ని గుర్తించి ప్రభుత్వమువారు మతవిషయాలందు అనవసరముగా జోక్యము కలుగచేసుకొనకూడదని తీర్మానించారు. కాని సంఘసంస్కరణలకు ఆవశ్యకత, అవకాశము ఉండునపుడు ప్రభుత్వమువారు మన సంఘాభివృద్ధికై ప్రజల ఉద్దేశాలను ఆశయాలను గుర్తించి చట్టములను ప్రతిపాదించవచ్చుననికూడ తీర్మానించినారు.

ఈ నూతన రాజ్యాంగవిధానము ప్రకారము మనదేశము ఒక బలమైన కేంద్ర ప్రభుత్వముతోను, భాషాప్రయుక్త రాష్ట్రాలతోను సర్వశ్రేష్ఠ స్వతంత్ర ప్రజాస్వామ్యముగా మారుతుంది. ఈ రిపబ్లికు కేంద్రప్రభుత్వమునందు ఒక అధ్యక్షుడు, అతని సహాయార్థము ఒక ఉపాధ్యక్షుడు ఉంటారు. అధ్యక్షుని నియమితకాలము 5 సంవత్సరములు. అధ్యక్షునికి సలహా చెప్పుటకు, ఒక మంత్రివర్గము. మంత్రి వర్గమువారు వారిలో నొకనిని ప్రధానిగా ఎన్నుకోవలయును అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగ విధానానికి, బ్రిటిషు రాజ్యాంగ విధానానికి సంధి మన నూతనరాజ్యాంగ విధానము. మన అధ్యక్షుని హక్కులు అమెరికా సంయుక్తరాష్ట్రాల అధ్యక్షుని హక్కులను పోలివుంటాయి. కేంద్రప్రభుత్వమునందు, ప్రజాభిప్రాయాలను వ్యక్తిగతము చేయుటకును ప్రజా ప్రతినిధుల సభలు (Houses of Parliament) రెండు ఉంటవి. నూతన చట్టములను ప్రతిపాదించుట, దేశపరిస్థితులను చర్చించుట వీటియొక్క ముఖ్యపనులు. రాష్ట్రాలలోకూడ గవర్నర్లు అధిపతులుగానుండగలరు. కేంద్ర ప్రభుత్వములోవలెనే రాష్ట్ర ప్రభుత్వాలలోకూడ చట్టములను ప్రతిపాదించుటకై రాష్ట్ర సమస్యలను చర్చించుటకై రెండు శాసన సభలు గవర్నర్లకు సలహా చెప్పుటకై మంత్రి వర్గము ఉంటవి.

రాజ్యాంగ విధానముందును, తదితర రాజ

కీయ విషయములందును న్యాయాన్యాయము లను విచారించి తీర్పుచెప్పుటకై ఒక ప్రధాన న్యాయస్థానము ఇండియా రాష్ట్ర సమితి (Indian union) యందు నెలకొల్పబడుతుంది. ఈ ప్రధాన న్యాయస్థానము (Supreme court) వల్ల బ్రిటనులోనుండే ప్రీవికౌన్సిలు (Privy council) కు అప్పీళ్లు తీసికొని వెళ్లనక్కర లేదు.

భారత రాష్ట్ర సమితిలో (Indian union) ఏయే రాష్ట్రములు అంతర్భాగములుగా చేరి యున్నవో వివరించెడు జాబితా ఒకటి ప్రత్యేక షెడ్యూలుగా ముసాయిదాలో చేర్చబడియున్నది.

రాజ్యాంగ పరిషత్తు మే నెలలోగాని, జూన్ నెలలోగాని సమావేశమై యీ స్వరాజ్య విధానపు ముసాయిదాను చర్చింపవలెను. ఆ చర్చ ముగిసిన తర్వాత ఇది స్వరాజ్య చట్టముగా మారుతుంది. అక్టోబరు 2 వ తేది మహాత్మాగాంధీగారి జన్మదినోత్సవము. ఆపర్వదినము స్వరాజ్య జన్మదినోత్సవముగా మారాలని కాంగ్రెసు నాయకుల ఆశయము. కమిటీవారు అన్ని దేశాలలోని రాజ్యాంగ విధానాలను సేకరించి, అవగాహన చేసుకొని, మన దేశాచారాల విశిష్టతకు, మన దేశము యొక్క నైసర్గిక సాంఘిక రాజకీయ పరిస్థితులకు తగునట్లుగా ఈ నూతన రాజ్యాంగ విధానాన్ని సృజించారు. వారికి 'మన ధన్యవాదములు.

★

బిడ్డల లివరు అండు స్ప్లీను వ్యాధులకు

పాత్రుడుగారి బాలసంజీవిని

డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడుగారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. బిడ్డలకు సంభవించు లీవరు అండు స్ప్లీను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందుగాని తప్పకుండ గుణమిచ్చును. నా వైద్యవృత్తియందును నా స్నేహితులలోను, బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుట కవకాశమేర్పడినది. బజారులోగల యితర లీవరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహదౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిల్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టర్ ఎస్. రామనాధన్ గారు, L. M. P. కావేరిపాకం.

వివరములకు:

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు & బ్రదర్సు,

నెం. 11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మద్రాసు 4.

కుంభకోణం బ్రాంచి:	తిరుచినాపల్లి బ్రాంచి:
నెం 7, సారంగపాణి కోవిల్,	నెం 15, పుగళై పిళ్లై వీధి,
తూర్పువీధి.	తెప్పకొలం.

అన్ని మందుల షాపులలోను దొరకును.

ముష్టి పిల్ల

శ్రీ వాడ్రేవు జోగిపంతులుగారు

మండు వేసంగి. మధ్యాహ్న సూర్యుడు మానవుల నడినెత్తి మీని కెక్కి ప్రళయతాండవం చేస్తున్నాడు. రోడ్డుమీద జన సంచారం సూర్యుని ప్రతాపాగ్నికి భయపడో ఏమో అరుదుగావుంది. ఫ్యాక్టరీ గొట్టం అప్పుడే పన్నెండు కూత కూసింది. కూలీ లొక్కరొక్కరే ఆవురావురుమంటూ బయటికి వచ్చి చెట్ల నీడలను కూర్చుని కష్టసుఖాలాడుకుంటూ ఆకలి దేవతకి నైవేద్యాలిస్తున్నారు. ధనవంతులు సుఖంగా భోంచేసి టేబిల్ ఫాన్ ప్రక్కన పెట్టుకుని హాయిగా నిద్ర చిత్తగిస్తున్నారు.

ఆ సమయంలో జమీందారు నారాయణబాబు భవనం గేటుముందు నిలబడి ఒక అనాథ బాలిక—పదిహేను పదహారేళ్లుండొచ్చు—సహృదయుల హృదయం కరిగేటట్లు తన ఆకలి బాధనంతనీ వెళ్లబోసుకుంటూ కాని డబ్బీయమని ప్రార్థిస్తూంది. దర్వాన్ పోపొమ్మని అదిలిస్తున్నాడు. జమీందారు ధార్మిక బుద్ధికలవాడని తెలిసుండటంచేత ఆమె మాత్రం అక్కణ్ణుంచి కదల్డంలా. ఇంతలో దివాన్ రామ్‌శాస్త్రి కారు గేటుముందాగింది. ఆతడు కారు దిగి లోపలికి పోబోతూ ఆమెను చూసి అలాగే నిర్జీవ ప్రతిమల్లే నిల్చుండిపోయాడు. చూస్తూన్న కొద్దీ మతిపోతూందాతనికి. తీర్చి దిద్దినట్లుండే ఆ పెకను బొమలు, మిలమిలలాడే ఆ నల్లని కళ్లు, ఆ ముక్కుతీరు, కొట్టొచ్చినట్లుండే ఆమె సౌష్టవం పౌర్ణమినాడు మబ్బుచాటునుండి తొంగి తొంగి చూసే శశాంకునిలాగా, చిరిగిన గుడ్డల్లోంచి కనబడే మిసమిసలాడే ఆమె దేహం ఇవన్నీ చూసే వరకు కామాంధకారం అతని కనుగప్పింది. దివాన్ శాస్త్రికి రేపోమాపో అరవయ్యోయ్యపడి ప్రవేశించనుంది. అయినా "తాతా! పెళ్లాడతావా?" అంటే "పిల్లనిచ్చేవారెవరు?" అంటాడేగాని "నాకు పెళ్లెందుకు?" అని అనడనే సామెతలాగా శాస్త్రికి తల నెరసినా కామతృష్ణ ఇంకాపోలేదు. మంచి మాటల్తో ఈమెను లోబరచుకోవాలని నిశ్చయించుకున్నాడు. కొంచెం చిరునవ్వు ముఖంపెట్టి, "అమ్మాయీ! నేను లోపలికి వెళ్లి ఇప్పుడే వస్తాను. ఇక్కడనేవుండు." అని శాస్త్రి లోపలికి వెళ్లిపోయాడు. శాస్త్రి ఎంతటి దయార్ద్ర హృదయుడో అనుకుంది పాపమా ముష్టిపిల్ల లోకంలో పయోముఖ విషకుంభాలుంటారనేటంత వరకు విస్తరించలేదింకా ఆమె విజ్ఞానం. కొద్ది సేపట్లోనే శాస్త్రి తిరిగివచ్చి ఆమెను కారులో ఎక్కమన్నాడు. ఆమె ఎక్కింది. కారు తిన్నగా పోయి శాస్త్రి ఇంటిముందాగింది. శాస్త్రి ఇంట్లో అతను అతని కుమారుడు, వంటలక్క తప్ప మరెవరూ లేరు. భార్య నాల్గేళ్ల క్రితమే చనిపోయింది. శాస్త్రి సరాసరి ఆమెను మేడమీదికి తీసికొని పోయాడు. వంట మనిషిని పిలిచి ఈమెచే స్నానం చేయించి మంచి బట్టలు కట్టబెట్టమని ఆజ్ఞాపించాడు.

శాస్త్రి ఆమెను మెప్పించటానికి ఇన్ని చేస్తున్నా అమాయిక ఈ చర్యలోని అంతరార్థాన్ని గ్రహించలేకపోయింది. శాస్త్రి ఆమెకు కడుపునిండా భోజనం పెట్టించాడు. ఆమెను తన గదిలోకి పిలిపించి కూర్చోబెట్టాడు. "మీరు అనాథబాలికనైన నా పట్ల యింత ఆదరం చూపించి కడుపు నిండుగా భోజనం పెట్టినందుకు కృతజ్ఞురాల్ని. మీ ఋణం ఏలా తీర్చుకోవాలో నాకర్థం గావడంలేదు. శలవిప్పిస్తే ఇంక వెళ్లొస్తా" నంది లేస్తూ. "ఆ! వెదుదువుగానిలే! కాసేపు విశ్రాంతి తీసుకో, పాపం! ఎండనక వాననక వీధి వీధి తిరిగావు!" అన్నాడు లేని దయ తెచ్చుకుంటూ. ఇంక ఆలస్యం చేయకూడదనుకొన్నాడో ఏమో లేచి ఆమె ప్రక్కగా సోఫాలో కూర్చున్నాడు. ఆమె కొంచెం ప్రక్కకి జరిగింది. అతనూ జరిగాడు. అతను లేచి ఆమె రెండు చేతులూ పట్టుకొని బలవంతం చేయసాగాడు. ఆమె "ఓరీ! తుచ్ఛుడా! ఇంత సేపట్నుంచీ నన్ను ఆదరించిందిందుకా? అమాయిక హృదయంతో నీ తుచ్ఛపు ఉద్దేశాన్ని కానుకోలేక పోయాను" అంది ఉక్రోషాన్ని వెల్లడిస్తూ. అతను

"లేకపోతే! నీ యబ్బసొమ్మనుకున్నావా? ఊరికే పెట్టడానికి? నీ వల్ల తగినంత పొందడానికి కాక పోతే?" వికృపు నవ్వు నవ్వుతూ, "తలుపులన్నీ ముందుగానే బిడాయించా. నువ్వెంత పెనుగులాడినా లాభంలేదు, రా! పెడసరం కబుర్లు మాను నిన్ను ఈ గృహానికి రాణీని చేస్తా. లేదన్నావా నీకిక్కడే మరణం" అన్నాడు. భయంతో ఆమె వణికిపోతోంది. అతడు తన పశుబలాన్ని ప్రయోగిస్తున్నాడు. ఎంత పెనుగులాడినా ఆమె అబల. గత్యంతరం లేక ఆమె ప్రక్కనున్న పువ్వుల కుండీ ఎత్తి అతని నెత్తి మీద ఒక పెట్టు పెట్టింది. దాంతో దివాన్ శాస్త్రి నిలువునా కూలిపోయాడు. ఆమె తలుపులు తెరచుకుని వేగంగా రోడ్డు వెంబడి పరుగులెడుతోంది. ఒంటి నిండా రక్తపు మరకలతో పరుగెడుతూన్న ఆమెను అనుమానించి బంధించారు పోలీసులు. శాస్త్రిని హాస్పటల్లో చేర్చారు. శాస్త్రి ఇక బ్రతకడం కష్టమన్నారు డాక్టర్లు. "ఆమె తప్పేమీ లేదు. కామాంధకారంలోపడి ఆమెను చెరచడానికి సిద్ధపడ్డాను. ఆమె నాకు తగినట్లుగా బుద్ధి చెప్పింది. ఆమె సుశీల. ఆమెను వదలండి. నా కుమారుడు వెంకట్రావుకిచ్చి ఆమెను పెళ్లి చెయ్యండి" అని మరణ వాఙ్మూలం వ్రాసి ఇచ్చాడు శాస్త్రి. "మానరక్షణ కోసం చేసిన పని ఇది" అని మేజస్ట్రేటు ఆమెను విడుదల చేశాడు. నలుగురి సమక్షాన బిక్షుకి కన్య—కాదు! కాదు!!—గౌరి వెంకట్రావుల కిద్దరికీ వైభవంగా వివాహం జరిగింది.

పారిశ్రామిక విద్యాలయము: ఆంధ్ర మహిళా సభ

ఉచిత వేతనములు

1. నేతపరిశ్రమలో తర్ఫీదు గోరువారికి మాసమునకు రూ. 5-0-0 ఉచిత వేతన మివ్వబడును.

11. అట్టి వేతనములను గోరువిద్యార్థినులు.

(1) ఈ ఊరువారుగా నుండవలెను.

(2) ఆంధ్ర యువతులుగా నుండవలెను.

(3) వయస్సున 17 వ సంత్సరములు దాటినవారుగా నుండవలెను.

(4) మంచి ఆరోగ్యము గలవారుగా నుండవలెను.

(5) 3 సంవత్సరములు పీడక విద్యనభ్యాసించువారుగా నుండవలెను.


(6) మధ్యలో విద్యాభ్యాసన పీడిన, పుచ్చుకున్న వేతనమును తిరిగి యిచ్చివేయుటకు సిద్ధులైయుండవలెను.

111. అట్టి వేతనములు నల్గురు యువతులకు యివ్వబడును.

IV. ఒక్కొక్క వేతనముయొక్క కాలపరిమితి 3 సంత్సరములు.

కరెస్పాండెంటు

సాది సాది సాది



సాది సాది సాది

అమృతాంజనము

గాని,

" యథాయథా................కాళీధవళత్వ శంకయా."

అమృతాంజనమా ! నీ కీర్తిముల్లోకములను దెల్పఁజేయు పూనికతో పెరుఁగు
చున్నప్పుడెల్లను, నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే
నా హృదయము మిక్కిలి పగితాపమొందుచున్నది సుమా !!!

ఏకాంకిక:

పరివర్తన

శ్రీ వసంతరావు రామకృష్ణరావుగారు (కవితా సమితి)

మొదటి దృశ్యం

[క్రీ. పూ. 236 సం॥ర ప్రాతం. పాటలీపుత్ర నగరం. రాజసౌధంలో అశోక చక్రవర్తి కొలువు తీర్చివున్న సమయం ప్రదేశమంతా నిశ్శబ్దంగా వుంటుంది. అశోక చక్రవర్తి సింహాసనాసీనుడై వుంటాడు. తెర తొలగగానే..................]

దౌవారికుడు : (ప్రవేశించి) జయము! జయము! అశోక మహీపతికి జయము! ప్రభూ! సార్వభౌముల సందర్శనార్థము ద్వారమువద్ద పరివ్రాజకుడు వేచియున్నాడు.

అశోకుడు : ఓయీ! ప్రవేశపెట్టుము.

(దౌవారికుడు నిష్క్రమించును)

[చేతిలో కమండలము దరించిన పరివ్రాజకుగులోనికి ప్రవేశము.]

పరివ్రాజకుడు : జయము! జయము! దేవానాంప్రియః మహాప్రియదర్శి విశాలమహీమండల మండన మౌర్య సామ్రాజ్యాధిపతీ! అశోక మహీపతి!! జయము జయము.

అశోకుడు : (సానునయముగ ఆసనము చూపుచు) ఈ ఆసనమలంకరింపుడు.

పరి : (సవినయముగ) మహాప్రసాదము—(అశోకునిసమక్షమున నాసీనుడగును)

అశో : పరివ్రాజకవర్యా! నీ వెవ్వరవు? ఎటునుండి నీ రాక?

పరి : ప్రభూ! నేను వర్ధమాను డను బౌద్ధభిక్షుకుడను. తీర్థయాత్రా సందర్శనాభిలాషినై, పుణ్యక్షేత్రములను సందర్శించి, పుణ్యమూర్తులైన సార్వభౌములను దర్శించు వేడుకతో నేడిట కరుదెంచితిని.

అశో : (ఆనందముతో) వర్ధమాన మునీంద్రా! నేడు నాకు సుదినము. నీవుదర్శించిన పుణ్యతీర్థ మహిమను తెలుపుము.

వర్ధమానుడు : మౌర్యమండలమండనా! వివిధ పుణ్యతీర్థ మాహాత్మ్యమును వివరింప నే నేపాటి! బుద్ధగయ, లంబిని, సార్‌నాథ్, మున్నగు పుణ్యక్షేత్రములను సందర్శించి, ప్రభువుల సమక్షమున కరుదెంచితిని.

అశో : మునిపుంగవా! సకల పుణ్యక్షేత్ర సందర్శనా నంతరము పాటలీపుత్రమునకు విచ్చేసి, రాజసౌధమునకు పవిత్రతనాపాదించినందులకు నా హృదయమానందముతో నుప్పొంగుచున్నది. (ఆనందమునభినయించును)

వర్ధ : మహాప్రభూ! తమదర్శనభాగ్యము లభించినందులకు నే నెంతయు సంతసించుచున్నాను. (సంతోషమున వినయపూర్వకముగాలేచి నిలువబడి)—స్వామీ! శెలవీయుడు—

అశో : అట్లేకానిమ్ము......(ప్రకాశముగా) మునివర్యా! నీ యాశ్రమ మెటున్నది?

వర్ధ : మహాసార్వభౌములు మాకొఱకేర్పచిన భద్ర బాహు పర్వత గుహారామమే మదీ యాశ్రమము. ప్రభువు అనుగ్రహించిన పునర్దర్శన భాగ్యము లభించును.

అశో : (ఉచ్చైస్స్వరమున) మా రాజధానికి మరల తప్పక విచ్చేయుము—అదియే మా యభిమతము—

వర్ధ : (వినయములతో) తప్పక యట్లే చేయగలవాడను—శెలవు—(కమండలాలంకృతక మెత్తి)—జయము! ప్రియదర్శ బిరుదాంచిత, మౌర్యకులతిలక! అశోకసార్వభౌములకు జయము! (వర్ధమానుడు నిష్క్రమించును.) (తెరపడును)

రెండవ దృశ్యం

[క్రీ. పూ. 239 సం॥ర ప్రాతం. ప్రదేశము—భద్రాబాహు పర్వత గుహారామంలో వర్ధమానుని ఆశ్రమం. వర్ధమానుడు శైలపాషాణ పట్టికాస్థండిలముపై నాసీనుడై వుంటాడు. సూర్యాస్తమయసమయమౌతుంది. కమండలధారియైన బౌద్ధభిక్షుడు ఆశ్రమప్రాంతంలో అడుగిడబోతాడు]

వర్ధమానుడు : (పర్యవలోకనతో) ఆశ్రమ ప్రదేశమున కెవ్వరరుదెంచియుందురు! (ఉచ్చైస్స్వరమున)—ఎవరక్కడ?......

బౌద్ధభిక్షుకుడు : (లోనికిప్రవేశించి) నేనొక బౌద్ధభిక్షుకుడను—ఇది యాశ్రమమని యెరిగి వచ్చితిని.

వర్ధ : (వదనముపై నిశ్చలదృష్టిప్రసరించుచు)—అభ్యంతరము లేదు—ప్రవేశింపుడు—(ఆసనము చూపును)

పరివర్తన

బౌద్ధ : (ఆసీనుడగుచు) వర్ధమాన మహామునీంద్రా! ధన్యుడను—పుణ్యాత్ముడను (హర్షోత్కంఠత వలన స్వరము గద్గదిక వడును)

వర్ధ : (సంభ్రమాశ్చర్యములతో) ఓహో! అశోకసార్వభౌములా! జయము—జ—య—

అశో : (వారించుచు) వర్ధమానమునిసత్తమా! నేటినుండి సన్యాసాశ్రమము స్వీకరించుచున్నాను. భౌతికసుఖ సంపదల విసర్జించి ఆధ్యాత్మికచింతనము చేయదలచితిని. రాజ్యపరిత్యాగమొనర్చి, పాటలీపుత్రమును విడిచి, నేడు నిన్ను దర్శించగలిగినందుకు సంతసించుచుంటిని.

వర్ధ : ఆహా! సార్వభౌమునకు సన్యాసాశ్రమమా! ఎంతటి మహత్తర పరివర్తన!! అఖండ యశోవిశాలుడైన యిట్టి యాదర్శ సార్వభౌమునికెట్టి మహోన్నత భావిగలదో కదా! (ఆలోచనాముద్ర వహించుచును)

అశోకుడు : ధర్మ మార్గాను వర్తినై పుణ్యక్షేత్రములయందే జీవిత శేషము గడపదలచితిని......

వర్ధ : అహింసామూర్తీ! ధర్మపథానువర్తీ!! నేనును అట్లే చేయనిర్ణయించు కొంటిని—కాని—అప్రస్తుత మనక నాపలుకులాకర్ణింపుము——నీవు సార్వభౌముడవై నెలకొల్పిన ధర్మవర్తన, నేటి నీ సన్యాసాశ్రమస్వీకరణ, ప్రపంచమం దాచంద్రార్కము కొనియాడబడగలవు.

అశో : ధర్మమున కట్టి మహోన్నత విజయములభించిన ప్రపంచమున శాంతి భద్రతలు తప్పక నెలకొనును.

వర్ధ : అశోకమహీపతీ! కాదు — కాదు — అశోకమునివర్యా! అందులకు సందేహములేదు—ఈ శిలా శాసనాదులు శతాబ్దముల పర్యంతము నిలిచి, బౌద్ధమతమును ప్రబోధించి, ప్రపంచ ధర్మమును చిరస్థాయిగ నిలుపగలవు—సారనాథ్ స్థూపమున చిత్రితమైన ధర్మ చక్రమే అందులకు నిదర్శనము.

అశో : ధర్మమునకెట్టి ఔన్నత్యము గలదో! అహింసా సూత్రములకెట్టి విజయము చేకూరగలదో!! (ఆనందానుభూతిని ప్రదర్శించును).

వర్ధ : (ప్రకాశముగా) అశోక మహాయోగీ! అవిరళత్యాగీ! ధర్మవిజయ సూచకముగ నేడే మనము సార్‌నాథ్ పుణ్యక్షేత్ర సందర్శనార్థము వెడలుదము, గాక!

అశో : (ఉచ్చైస్స్వరమున) మహానందము! తప్పక ప్రయాణము కాగలము. (ఇరువురు నిష్క్రమింతురు)

[తెరపడును]

చంటిపిల్లల తల్లుల,

బలానికి ఓ టానిక్



ప్రసవానంతరం కలిగే బలహీనత పోగొట్టేనిమిత్తం వెంటనే గుణమిచ్చి, శరీరానికి పుష్టినిచ్చే టానిక్ అవసరం. దేహానికి పుష్టి, శక్తి నిచ్చేటందుకు అవసరమయిన ఆహారమంతా రక్తోజ్‌లో వుంది. రక్తోజ్, తల్లిద్వారా శిశువుకీ, ఆరోగ్యమైన దేహమూ, చలాకీతనమూ ప్రసాదిస్తుంది.

రక్తోజ్

దక్కన్ ఆయుర్వేదాశ్రమ్ ఫార్మసీ లిమిటెడ్
హైదరాబాదు, దక్కన్

ADARTS DAY 533 TL

వాసంతోత్సవములు

శ్రీమతి మన్య కామేశ్వరిగారు

శిశిరము చెల్లిపోవుచున్నది. శిరీషము మొదలు చింతవరకు క్షితిరుహములన్నియు నాకులు రాలి, క్రొంగ్రొత్త చివురులు దొడుగుచున్నవి. పల్లవములు బిరుసెక్కి హరితవర్ణమున మురువులు నెఱపుచున్నవి. పుష్పలతలు మొగ్గదొడిగి దోరగిలి ప్రసవసంభరితములగుచున్నవి. స్వచ్ఛమై, సౌగంధ్య బంధురమై దక్షిణానిలము మందగమనముదాల్చుచున్నది. మావి చివుళ్లు మెక్కి మెత్త పికములుగున్నమావి కొమ్మలపై గూర్చుండి, కమ్మని కూజితమ్ముల జిమ్ముచున్నవి. శుకశారికావారముల కలకలారావములు మధురములై యొప్పుచున్నవి. విమల జలపూరితములై సెలయేఱులు జిలిబిలి ధ్వనులావరించి పాఱుచున్నవి. ప్రకృతి యంతయు బరమశోభాయమానయై సౌభాగ్యబంధురమై ప్రకాశించుచున్నది.

నూతనాబ్ద ప్రవేశ మేదేశవాసులకైన నసదృశోత్సాహము గూర్చుట సైజము. హృదయోత్సాహము బహిర్గతమైనపుడు వివిధములైన యుత్సవములు, తిరుణాళ్లు, పండుగల రూపము ధాల్చుచున్నవి. ఆ యా దేశములయందలి జనుల మనః పరిపాకము ననుసరించియు—నాచార పరిణతిబట్టియు—నాదర్శములయున్నతి ననుసరించియు, నీ యుత్సవములు భేదంబులగు చుండును.

భారతదేశమున నాధ్యాత్మిక దృష్టియధికము. ఇందలి యాచారవ్యవహారవిహారములన్నియు మునులచే సుప్రతిష్ఠితములు, నిరాడంబరములును నిరుపమ మర్యాదా పరిపోషకములయినవి. కేవలము బుద్ధికి మాత్రమే గాక లోపలి యంతఃకరణమునకు సంబంధించినవి. అందఱ కాదర్శ ప్రాయములు కాదగినవి.

•

ఈ భరతఖండమునందంతటికన్న "రాజస్థానము"న నీ యుత్సవము లఖండ భక్తి శ్రద్ధలతో నాచరింపబడుచున్నవి. అందునను "మీవారు" రాజ్యమున వానికి వాసి ఎక్కువ. చైత్రశుద్ధ పాడ్యమి దినము "మీవాడ"నేవాడ జూచినను సొంపుల నింపుచుండును. ప్రతి నగరమునందును స్త్రీలును, బురుషులును బంధుత్వమును బురస్కరించుకొని, గుంపులు గట్టి యుద్యానవనముల కరిగి సబంధు పరివారముగ రాజభోజనము లొనరించి మల్లెలు, మొల్లలు, విరజాజులు, గన్నేరుల సరము లలంకరించుకొని వనవృక్షములపై నుయ్యేల లూగి సాయంతనమునకు సమధికోత్సాహముతో సదనములకు జనుదెంతురు.

చైత్ర మాసోదయ వాసరములు రాజపుత్రులకు బుష్పోత్సవ వాసరములు. ఇవి తొమ్మిది దినములు సాగును. తొమ్మిదియను సంఖ్య సృజన శక్తిద్యోతకమని విజ్ఞులయభిప్రాయము. దీనినే పర్యాయమున "వాసంత నవరాత్రము" లనియు వాడుదురు.

ఇటలీ దేశమందలి రోము నగరమున వత్సరారంభమున ధాన్యోత్సవముల నాచరించుచుందురు. మేవాడ వాసంతోత్సవము లన్నియంశముల దీనికి మిన్నయని చరిత్ర కారులు పరిగణించిరి.

ఈ యుత్సవములలో గౌరిదేవ్యారాధనము ముఖ్యము. వీనిలో స్త్రీ జనము యెక్కువగా పాల్గొనును. గౌరీదేవి—పంటసిరికి బర్యాయముగా గ్రహింతురు.

ఈజిప్టుదేశమున నీ గౌరీదేవిని "ద్విభుజ" దేవతగా గొలుచుదురు. సృష్టి చిహ్నమని వారు భావించు పద్మమొక చేతను, శంఖ, చక్ర, గదాద్యాయుధములు (లయ చిహ్నములు) మఱొక చేతను ధరింపజేయుదురు. గౌరీ—కాళీ నామములతో వారు గొలుచుదురు.

ఈ వాసంతోత్సవములలో నుదయపురమున గౌరీదేవి "నన్నపూర్ణా"భి దానముతో నర్చింతురు. మిహిరుడు మేషరాశి బ్రవేశించినపు—డనగా—నూతన సంవత్సరము ప్రవేశించినంతనే పౌరులందఱు ప్రతినిధులుగ గొందఱు బయలుదేరి యూరి వెలుపలికి వెళ్లి మంగళవాద్యములతో మట్టిని దోడి తెత్తురు. మరునాటి యుదయమున గౌరీ విగ్రహము సిద్ధముచేసి యింట నొకచోట బ్రతిష్ఠింతురు. అందలి మృత్తికతో మహేశ్వరుని చిన్న విగ్రహము నొనరించి మృడానీ దేవి ప్రక్కను నుంతురు.

వాసంతోత్సవములు

ఆ దినమే యీ దంపతుల బింబముల ముంగలి భాగమున గందకము ద్రవ్వి యవధాన్యము నాటి నీరు గట్టుదురు. కృతకోష్ణము సంధించి ధాన్యము మొలకెత్త జేయుదురు.

యవలు మొలకలెత్తిన యంతనే పొలతుకలందరు మూగి చేతులు కలిపి గౌరీదేవి సమక్షమున నిలిచి పాటలుపాడుచు నాట్యము చేయుచు రాగలవత్సరమంతయు వారి ప్రాణనాయకులకు బరమ భాగ్యభోగము లొసగి కాపాడుమని యామె యాశీస్సుల గోరి ప్రార్థింతురు.

అనంతరము మొలకలు పెరికి మగువలందరు వారి వారి మిత్రులకు, బంధువులకు సమర్పించు కొందురు. వారును మొలకలను దోసిళుల గ్రహించి సంపూర్ణ శ్రద్ధా భక్తులతో గన్నుల నద్దుకొని రుమాలు లెత్తి శిరముల ధరింతురు.

ఇట్లే డెనిమిది దినములు జరిగిపోవును. తొమ్మిదవ దినము గ్రామోత్సవము జరుగును. దీనికై సర్వవిధముల మహోత్సాహముతో కార్యములు దీర్చుచుందురు. ఈ వారము దినములును నగరముననే యితర విచారములును చింతలును, వితర్కములు నుండవు. ఎవరినోట వినినను గౌరీదేవ్యుత్సవముల మాటలే. ఎవరికడ వినిన నామె మెరవడిని గురించిన తెలుంగులే. గతవత్సరమున కంటె ప్రస్తుతవత్సరమున దేవ్యాలంకారముల విశిష్టత. వాని ప్రత్యేకత బంధుజనుల సంఖ్య—సాయంతనము వేడుకకై సాగించు బాణసంచుల వర్ణనము—అట్లుయే వాడ నేవాడ జూడ జొచ్చినను భవానీ దేవ్యుత్సవముల ప్రసక్తులే.

తొమ్మిదవ నాడు మధ్యాహ్నానంతరము రణభేరీ భాంకరణములు మ్రోగును. ఏకలింగేశ్వరస్వామివారి యాలయము పైని బురుజులనుండి శతఘ్నుల ఘోషము, గౌరీదేవి సరోవరవిహారమునకు వెడలునని ఘోషించును. అప్పుడితరాలోచనములు మాని యందఱి హృదయములు తన్మయత్వమొంది యా యుత్సవోత్సాహములతో నిండి నిబిడీకృతమైయుండును.

ఉదయపుర బాహ్యప్రదేశమునకు సమీపముననే యుదయసాగర సరోవర మొప్పారుచున్నది. ఆ సరస్తీరమున్నతమై చిన్న గుట్టలతో జేరియుండును. ఈ గట్టులపై నొకచో మహారాణీగారికి నొక యెత్తైన రమ్యహర్మ్య రాజమును, సేనాధీశసామంతులకు సాధారణ సౌధములును సిద్ధముజేసియుందురు. ఈ ప్రదేశమంతయు ప్రేక్షకులు గుంపులై యిసుక వేసిన గ్రిందరాలకుండ గ్రిక్కిరిసి పోవుచుందురు. రాణీగారి తాత్కాలిక విలాస రమ్యహర్మ్యమునుండి కాసారమున జలమువరకునుగల వందలకొలది స్ఫటిక సోపానపంక్తులయందంతటను జీని చీనాంబరములు ధరించి—నవరత్నరంజితనవ్య భూషానివహము దాల్చి మల్లికా మాలతీ పుష్పగర్భితములగు తమ ధమ్మిల్లములపై నరవాటున గప్పిన జిలుగు పయ్యెద లలరారు జలరుహానయనలు గుమిగూడియుందురు.

మహారాణీగారు మొదలు కడపటి సేవకుని వరకందర ముఖారవిందముల మృదుమధుర దరహాసాంకురములు చిందులు ద్రొక్కుచుండును, పూర్ణిమ సమీపింపకయే పూర్ణసౌందర్యమున బొదలు సంపూర్ణశశాంకబింబములు కొలకునకు సంబంధింపక వెలుగు వెల్లువలు చిమ్మ నీలోత్పల మాలికలు పాలసంద్రము పరగడ లేచున్నను స్వచ్ఛందముగా ప్రభవించి ప్రకాశించు పద్మాలయాపరావతారలునయి సకల జనలోక లోచనోత్సవము సేయు నా నారీశిరోవతంసముల జూచి యెవ్వరానందించి యారాధింప నభిలషింపరు. నడు నెత్తిపై మబ్బులు లేని వినీలాకాశము నలుపురంగుల నిగనిగలాడుచున్నది. కింద వినిర్మల విశాలవారిపూర పూరితమగు రమణీయకాసార రాజము, దాని తీరమున నలువైపుల మాకంద మాతులుంగ రంభానారంగ నారికేళ ఫలవృక్షములును—మాలతీ మాలవీ జాతీ పుష్ప వృక్షములును నలరారుచుండ జూచి సంతోషించవలెనని వేయికనులు కావలెగాక, ఊరక వర్ణింపనెవరి సాధ్యము. ఇంతటి సందడిలో—నింతటి యుత్సాహమున నెచ్చటనైన నించుక దౌర్మార్గ్యమునకుగాని దుష్టదలంపులకుగాని తావుండదు. అచ్చట మధుపాన కలుషితులు మందునకైన గానరారు. గుంపుభరింపరానిదై—పొగరుబోతుల పెడబొబ్బలకుగాని, క్రమభిన్నతకుగాని, యాస్పదమావంతయు నలరారదు. అంద ఏకాగ్రచిత్తులై గౌరీదేవి దివ్యదర్శనము గోరి గట్టునగల త్రికోణ మహాద్వారము దెస దృష్టి నిగుడించి చూపెట్టియుందురు.

పచ్చని పీతాంబరములు విడంబించు స్వర్ణసింహాసనమున గౌరీ విగ్రహము నమర్చియుందురు. ఆణిముత్యాల సరులును

వాసంతోత్సవములు

హాటక భూషణములు కనులు మిరుమిట్లు గొలుపుచుండును. ఈ సింహాసనమును దృఢమైన చెక్కలచే సమర్పబడిన యొక పీఠముపై నిలుపుదురు. విగ్రహము పై భాగమున నాచ్ఛాదన మొసంగవలెనని గొప్ప ప్రభగట్టియుందురు. గౌరీదేవి సింహాసనమున కుభయపార్శ్వముల నుదయపురమందలి సౌందర్యవతులలో నెల్ల సౌందర్యవతులగు నిరువురు సరసీరుహవదనలు గూర్చుండి హేమచామరముల వీచోపులిడుచుందురు. వీరి కన్న నన్నువతనమున మిన్నలగు ననబోడులు పురోగామినులై అమ్మవారి వెంట నరుదెంచుదురు. వీరు వెండి బెత్తముల ధరియించి విశ్వజననిరాకను వేయివిధముల వెల్లడించుచుందురు. అందరును మృదుమధుర గానము నొనరించుచుందురు.

ఇట్లు బయలుదేరి స్ఫటిక సోపానముల వెంట జలాశయమునకు దిగివచ్చినప్పుడు మహారాణీగారును, సచివసామంతులును లేచి నిలిచి సమధిక భక్తితో శర్వాణికి స్వాగతమొసగి నమ్రులై నమస్కరించి, యామె నీటి యొడ్డున సింహాసనమున గూర్చుండినంతట, నందరును జేరువగల పడవలలో గూర్చుందురు. అరవిందముఖులందఱు అపర్ణాదేవి చుట్టును చుట్టుకొని చేతులుగలిపి క్రమము తప్పక అడుగులు వేయుచు, శరీరవికాస విలాసములలరారు లాస్యములతో, జేతులు తట్టుచు దాళము సూచించుచు రాగాధిరోహణావరోహణముల సొంపునింపుకు పరిమిత పాదవిన్యాసములతో విగ్రహమును బరివేష్టించి నాట్యమాడుచు, పాటలు పాడుదురు. అన్నపూర్ణాదేవియెడ భక్తిని సూచించునవియు, శుద్ధ ప్రణయము గూర్చినవియు, వీరాధివీరుల సాహసౌదార్యముల గూర్చినవియు, రాజపుత్రుల జాతీయప్రాశస్త్యము నెఱుపునవియునగు నాగీతల వర్ణింప వేయి నాల్కలుగల విషధర సార్వభౌమునకైన దరముగాదు. రసాధిరోహణము ననుసరించి తన్మయులై రాజులు, మంత్రులు, సామంతులు తలలూచి "బేస"ని మెచ్చుకొనుచుందురు. ఆ గాయనీమణులును గౌరవపూర్వకముగా శిరములు వాల్చుచుందురు.

ఇంతటి గొప్ప సందడిలో నొక్కమగపురుషైన వారి నడుమ మెలగడు. గౌరీదేవి ప్రక్కన నిలుపబడిన మహాదేవుడు గూడ జనుల దృష్టి శ్రద్ధల నాకర్షింపడు. కాషాయ వస్త్రములు దాల్చి కపాలపాత్రము నెత్తి విశ్వమాతయగు నన్నపూర్ణాదేవి ప్రోలభిక్షమడుగునట్లుండును.

గౌరిదేవి యింతసేపును దానమాడుచున్నదని వారి యాశయము. స్నానమైనంతనే సకల మర్యాదలతో బూర్వ సంప్రదాయములతో శాంకరీదేవిని సాయంతనమునకు రాజహార్మ్యమునకు గొనిపోవుదురు. ఆ రాత్రియంతయు నానావిధములైన పూల వత్తులు—పగలు వత్తులు—బిరుసులు—చంద్రజ్యోతులు లోనగు బాణసంచు గాల్చుదురు.

రాజస్థానమందలి గౌరీదేవ్యుత్సవములకు నీజిప్టునందలి "డయానా" దేవ్యుత్సవములకు నెంతో పోలికగలదని "టాడ్డు" మహాశయుడు నెల విచ్చియున్నాడు.

★

గమనిక

వ్యాసములు పంపువారు కాగితమునకొకప్రక్కను మాత్రమే త్వరలో చదువ వలనుపడు దస్తూరిలో వ్రాసి పంపవలెనని మనవి. ఇట్లు పంపినచో, వారి వ్యాసములు త్వరలో ప్రచురించుటకు వీలగును—అదియుగాక వ్యాసములు క్లుప్తముగా రెండు అచ్చు పేజీలకు మించనివిగా నున్నచో మాకెంతయు సహాయ్యముగానుండును.

సంపాదకురాలు

క్రొత్తకాపురం

శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు

సోమశేఖరరావు—సిజుఆలో ఒక పెద్ద బొగ్గు గనికి అసిస్టెంటు మేనేజరుగానుండి క్రొత్తగా పెండ్లి చేసికొనివచ్చిన తన స్నేహితుడు సుందరాన్ని చూడాలని బయలుదేరాడు. కలకత్తా నుంచి ధన్‌బాదులో రైలుమారాడు. డూప్లికేటులో వెడుతోన్నాడు సిజుఆకు. దారిపొడవునా పచ్చని పైరుగాని, చక్కని చెట్లుగాని, యిండ్లుగాని యేమీ కనబడడం లేదతనికి. ఎక్కడ చూసినా పొడవుగా పేర్పబడి మండుతోన్న బొగ్గుల గుట్టలే. ఆకాశమంతా పొగ క్రమ్మియుంది. మొదట మండుతోన్న ఒకటి రెండు గుట్టలనుచూచి కాలుతోన్న శవాలేమో అనుకొన్నాడతను. అదంతా శ్మశానమనుకొన్నాడు. చుట్టు ప్రక్కల నెక్కడా ఊరు కనబడదే, మనుష్య సంచారమైనా ఆట్టే లేదే, ఇక్కడింత శ్మశానవాటిక ఉంటుందా అనుకొన్నాడు. రానురాను ఎక్కడ చూచినా మంటలే. మధ్యమధ్య కాలి చల్లారిన బొగ్గుల గుట్టలుకూడా ఉన్నాయి. అప్పుడు తెలిసికొన్నాడు ఇది శ్మశానంకాదు బొగ్గుగనుల సమీపంలో కోకును తయారుచేసే ప్రాంతమని.

సిజుఆ స్టేషను వచ్చింది. తన స్నేహితుణ్ణి ఎదుర్కొనుటను సుందరం స్టేషనునకు వెళ్లాడు. ఇరువురూ సరదాగా కబుర్లు చెప్పుకొంటూ వెడుతున్నారు. రోడ్డంతా నల్లగా బొగ్గుమసి. రోడ్డు ప్రక్కల్ని బూడిదగుట్టలు, బొగ్గుగుట్టలు, కాలుతోన్న బొగ్గురాసులు. ఇంతకుమించి యింకేమీ కనబడడంలేదు. సుందర్రావు ఎంతో సరదాగా, సంతోషంగా చెబుతోన్న కబుర్ల మధ్య అతనేమీ మాట్లాడకుండా వింటూ వెడుతోన్నాడు.

ఇంటికి వచ్చారు. వీధిలో కొళాయిదగ్గర కూలివాళ్ళు స్నానాలు చేస్తోన్నారు. ఎత్తు పళ్ళు, నల్లటి శరీరాలు, కాంతిలేని కళ్ళు, రుప్పలవలె నున్న జుట్లు, శరీరం కన్న మసిపారియున్న గుడ్డలు. అప్పుడే గనిలోనుండి వచ్చి కొళాయి వద్ద స్నానం చేస్తున్నారు. మగ ఆడ అను భేదం లేకుండా అంతాకలిసి కబుర్లు చెప్పుకొంటూ, నవ్వుకొంటూ, ఒకళ్లమీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకొంటూ అతి సరదాగా స్నానాలు చేస్తున్నారు వాళ్ళు. ఆడవాళ్లకు పైన పైటలులేవు. పైటలు లేవనే భావంకూడా వాళ్లకులేదు. సోమశేఖరానికిదంతా చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది. రావణాసురుని లంకలోని రాక్షసులా అనిపిస్తోంది వాళ్లని చూస్తే.

కలకత్తాలో ఆ చక్కని తారురోడ్లు, ఆకాశమును ముద్దుపెట్టుకొనే మేడలు, కన్నులపండువ చేయు పార్కులు, చిత్రకళా మందిరాలు, మంచి మంచి షాపులు, చక్కగా దిద్దుకొని రంగు రంగుల దుస్తులతో సీతాకోక చిలుకల్లాగు ఇంద్ర ధనస్సుల్లాగ తిరిగే సౌందర్యవంతులగు స్త్రీ పురుషులు మొదలైన అందమైన దృశ్యాలనే

ఎల్లప్పుడూ చూస్తోన్న ఆ కళ్లకు ఇదంతా అతి అసహ్యముగా కనబడుతోంది అతనికి. అతి చక్కని వాడు తన స్నేహితుడు. అంతకన్నా రూపసి అతని భార్య. అందంకోసం వాళ్ళు పడే టంత తాపత్రయం ఇకెవరూ పడతారనుకోను. అందమైన దృశ్యాల్నే కాని మరోదృశ్యాల్ని చూచి సహించలేరు ఆ దంపతులు. ఆలాంటి వాళ్ళు ఈలాంటి ప్రదేశంలో ఏలా నివసిస్తో న్నారా! అని అతని ఆశ్చర్యం.

లోపలికి తిన్నగా డ్రాయింగు రూములోకి వెళ్లారు. పోలిషు చేసి క్రొత్తగానున్న కుర్చీలు, సోఫాలు, మధ్యనోక పెద్ద గుండ్రని టేబిలు, దానిమీద ముద్దులు మూటకడుతో అతి సున్ని తంగా కుట్టబడిన ఎంబ్రాయిడరీ టేబిలు క్లాత్తు, గుమ్మాలకూ, కిటికీలకూ రకరకాల చిత్రవిచిత్ర మైన ఎంబ్రాయిడరీకర్టెన్లు అక్కడి గోడలకు తగి లించి యున్నవి. ఫొటోలు కావు. బజార్లో కొన్న పెయింటింగులూ కావు. భార్యాభర్త లిరువురచే వ్రాయబడిన రకరకపుల చిత్తరువులు. పైన పంకా తిరుగుతోంది. మంచి పవరు కలిగిన Sixty wats ఎలెక్ట్రిక్కు దీపాలు నాలుగు వెలుగుతోన్నాయి. టేబిలుమీది పలహారాల పళ్లాలమీద చక్కని లేసులు కప్పియున్నాయి. ఒక చోట చాపమీద భూలోకంలోకి దిగి వచ్చిన సరస్వతీదేవియా యనునట్లు మెరిసి పోతో హాయిగా వీణ వాయించుకొంటో తన భర్త రాకకు ఎదురుచూస్తో కూర్చున్నది కళాదేవి. సోమశేఖరం ముగ్ధుడై నిలబడిపోయాడు కళాదేవి వీణ నక్కడ పెట్టి వారి కెదురుగావెళ్ళి వచ్చారా రండి రండని ఆహ్వానించింది వారిని.

ముగ్గురూ కుర్చీలలో కూర్చుండి పలహారం చేస్తున్నారు. "సుందరం! పదార్థాలన్నీ చాలా రుచిగానున్నాయి. మంచి వంటవాడెవరైనా ఉన్నాడా మీకు?" అని అతను అడిగాడు.

"ఈ వూళ్లో వంటవాళ్ళుకూడా దొరుకు తారా? ఇవన్నీ మా ఆవిడ తయారు చేసినవే."

"ఈ డోరుకర్టెనులన్నీ మీ ఆవిడ కుట్టిన వేనా? ఏ కంపెనీలోనైనా కొన్నారా?"

"ఆమె కుట్టినవే."

"పెయింటిగ్సు అన్నీ ఒరిజనల్సు సంపాదిం చావే. ఏలావచ్చాయి?"

"నేను వేసినవి కొన్ని, మా ఆవిడ వేసినవి కొన్ని." సోమశేఖరాని కాశ్చర్యం ఎక్కువ యింది.

"సుందరం నీవెంత అదృష్టవంతుడవోయి సార్థక నామధేయ, కళామూర్తి ఈ కళాదేవిని భార్యగా బడయుటకు. మీ రిరువురు ఇంత సౌందర్యమూర్తులు, సౌందర్య పిపాసులు, కళో పాసకులు, ఉన్నత విద్యావంతులు, ఉన్నతాశ యములు గలవారు ఈలాంటి ప్రదేశంలో ఏలా కాపురం చేస్తాన్నారు?"

"మనస్సు కలిసిన స్నేహితులుగాని దంప తులుగాని ఒకచోట నున్నప్పుడు అడవే ఉద్యాన వనమవుతుంది. పూరిగుడిసే రాజప్రాసాద

మాతుంది. అందము ప్రేమించే వాళ్లకు అన్నిటి లోను అందమే కనబడుతుంది. రవీంద్రనాథ టాగూరు గడ్డిపరక నెంతో చక్కగా వర్ణించాడు. పెద్ద ఉద్యోగాలు కావాలి పెద్ద పట్టణాల లోనే నివసించాలి అంటే ఏలావస్తాయి. ఈ నిరుద్యోగపు రోజుల్లో మాకిదే బాగుంది. హాయిగా ఉంది. ఒకళ్లజోలి ఒకళ్లసొంత మా కక్కర లేదు. హానీమూన్ ఎంజాయి చేస్తున్నాం హాయిగా.

“పితృవాక్యపరిపాలనకొఱకు సీతారాములు, మాట నిలుపుకొనుటకొఱకు నలదమయంతులు, సత్యవాక్య పరిపాలన కొఱకు చంద్రమతీ హరిశ్చంద్రులు అరణ్యములోనే భూలోక స్వర్గ మనుభవించారు. దేశ సౌభాగ్యమును కోరే మేము ఈ బొగ్గుల గనుల మధ్య నందన వనమును నిర్మించుకొంటోన్నాం” అంది కళా దేవి నవ్వుతో.

★

రీటా హెయిర్ టానిక్

తల వెంట్రుకలను పెంచును




రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్‌టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరుకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొంది యున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూ దేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు.

RITA

HAIR TONIC



తివాసీ పరిశ్రమ

శ్రీ పేకుమళ్ల విశ్వనాథంగారు

భారతదేశపు భావిసౌభాగ్యం గృహపరిశ్రమలపైనే ఆధారపడివుంది. గ్రామీణులైన స్త్రీల జీవనోపాధికిగాని, సత్కాలక్షేపానికిగాని తోడ్పడగల పరిశ్రమల సంస్థాపనకు ఈనాడు ఎంతైనా అవసరంవున్నది. అట్టి పరిశ్రమలను గురించి విమర్శనా పూర్వకంగా శ్రీ పేకుమళ్ల విశ్వనాథంగారు ఆలిండియా రేడియో మద్రాస్ కేంద్రంనుంచి బ్రాడ్‌కాస్ట్ చేసిన ప్రసంగాలలో ఒకదాని నిట పొందుపరుస్తున్నాము. —సంపాదకురాలు

మన దేశం నూలు పరిశ్రమలో యెంత ప్రఖ్యాతి పొందిందో, ఉన్ని పరిశ్రమలోకూడ అంత ప్రఖ్యాతి పొందింది. నూలు పరిశ్రమలాగే ఉన్ని పరిశ్రమకూడ చాల పురాతనమైనది.

ఉన్ని పరిశ్రమ రెండు విధాలు. మొదటిది శాలువుల నేత, రెండవది తివాసీల నేత. ఈ శాలువులనే 'షద్దర్లు' అంటారు. వీటికి ప్రాచీన కాలంనుంచీ కాశ్మీరు శాలువలని ప్రసిద్ధి. తివాసీలనే రత్నకంబళ్లు అని కూడ అంటారు. తివాసీల నేతకూడ కొంత ప్రాచీనమైనదనే చెప్పవచ్చును. దీనికి కాశ్మీరు, ముల్తాను ముఖ్య కేంద్రాలుగా ఉండేవి. ఈ పరిశ్రమ మహమ్మదీయులు మన దేశంపైకి దండయాత్రలు చేసి స్థావరం ఏర్పరచుకొన్న కాలంలో మన దేశానికివచ్చింది. క్రమంగా అభివృద్ధిపొంది మొగలు పాదుషాల కాలంలో చాల ఉచ్చదశకువచ్చింది.

క్రీస్తుశకం 1550 ప్రాంతాలలో అరబ్బులు మన రాజధానిలో చేరినప్పుడు వారితో యీ పరిశ్రమ దక్షిణ దేశానికి వచ్చి నెలవు యేర్పరచుకొని క్రమేణావృద్ధి పొందింది. మహమ్మదీయుల పరిపాలనలో వృద్ధిపొందిన యీ పరిశ్రమ ఆంగ్లేయుల వర్తక సంబంధము కలిగిన నాటినుండి క్షీణింప సాగింది. దీనికి కారణము పాశ్చాత్య వర్తకుల కళాదృష్టితో గాక వ్యాపార లాభదృష్టితో ఈ పరిశ్రమను పోషింప జూడడమే. అట్టి పరిస్థితులలోనైనా నూరేండ్ల క్రిందటి వరకూ తివాసీ నేత కేవలం పడిపోలేదు. 1850 ప్రాంతాల్లో కూడ యీ తివాసీలు చాల అందంగా, ఆకర్షకంగావుండేవని సర్ జార్జి బర్డువుడ్ మొదలగు కళా పరిశీలకులు వ్రాసేరు. బందరు తివాసీలు; ఏలూరు తివాసీలు; ఓరుగల్లు తివాసీలు; మలబారు తివాసీలు చాల ప్రసిద్ధిగావుండేవి.

1900 నాటికి యీ పరిశ్రమ క్షీణించి ప్రభుత్వ సహాయం ప్రజాదరణ లేక ఒక కళగా కాక జైలులో ఖైదీలకు కల్పింపబడే వృత్తిగా చాలావరకు మారిపోయింది. క్రిందటి ఐరోపా సంగ్రామకాలంలో తివాసీల యెగుమతులు వీలుపడక కొంత నష్టం కలిగింది. ఆ తరువాత అంటే 1925 ప్రాంతాలలో ఏలూరు; తంగెళ్లమూడి; శనివారపుపేట; మచిలీబందరు కేంద్రాలలో నిలిచి, మొత్తం సుమారు 120 కార్ఖానలలో 250 తివాసీ మగ్గాలకు 5000 మంది పనివాళ్లకు పని కల్పించేది. సుమారు 30,000 చతురపు గజాలు సాలీనా తయారయేవి. వీటిలో సాధారణంగా అంగుళానికి 5 మొదలు 7 ముళ్లవరకు ఉండేవి.

1930 ప్రాంతంలో వచ్చిన ఆర్థిక మాంద్యంవల్ల యీ పరిశ్రమకు దెబ్బతగిలింది. ప్రపంచం అన్ని దేశాలలోను కొనుగోలు శక్తి తగ్గిపోవడంవల్ల తివాసీల వ్యాపారం తగ్గిపోయింది. దానివల్ల తివాసీల నేత మజూరీలు ధరలు పడిపోయేయి. అదివరలో గజము 5-8-0 ఉండిన తివాసీ రు 4-0-0 లకు తగ్గిపోయింది. కూలి రు 0-8-0 నుంచి రు 0-6-0కు తగ్గింది. ధరలు ఖూలీ తగ్గినకొద్దీ సరకు నాణెం తగ్గింది. పరిశ్రమ పనివారు చెడిపోయేరు కాని వర్తకులు (Middle men) మాత్రం చెడలేదు—తక్కువ ధరలలోనే మజూరీలు యింకా తగ్గించి వారు తమ లాభాలు పొందేవారు. 1935—36 లో ఆర్థిక మాంద్యం తగ్గి ఆర్థిక పునర్నిర్మాణం ప్రపంచంలో ప్రారంభమైనప్పటినుంచి పరిస్థితులు కొంత బాగుపడే సూచనలుకనిపించేయి. ఎగుమతులు వృద్ధికాగా ఉత్పత్తి కొంచెం హెచ్చింది. కాని ధరలు మజూరీలు మాత్రం హెచ్చలేదు. రానురాను ధరలు గజం రు.4-0-0 నుంచి రు.3-8-0కు తగ్గేయి. కాని నేత వాళ్లకు

పనులు మాత్రం దొరికేయి. వర్తకుల లాభాలు వేరే చెప్పనక్కరలేదు. పరిస్థితులు మళ్లీ చక్కబడతాయి అనే ఆశ పుట్టుతూ ఉండగానే 1939 యుద్ధం వచ్చి పడింది. యుద్ధంవల్ల విదేశయెగుమతులు ఆగిపోయి మన దేశంలోనే సరకు విడుదల చేసుకోవలసివచ్చింది. జీవితపు ఖర్చు ముడి పదార్థాల వెల యెక్కువయేయి కాని తివాసీల ధర పెరగలేదు. కనుక పనివారు మజూరీలు తగ్గించుకొని బతకవలసిన అవస్థ కలిగింది. ముందు రు. 0-6-0 ఉన్న రోజు సంపాదన రు. 0-5-0 అయింది. ఈ కారణంవల్ల కొందరు తివాసీ నేత మాని గిన్నెలు మాటడం, కళాయిపూయడం మొదలైన వృత్తులు అవలంబించేరు. ఏలూరులో ఒకతను 15 సంవత్సరాలు తివాసీ నేతలోవుండి, పెళ్లి కాగానే ఆ వృత్తిమాని కళాయిపూత ప్రారంభించేడు. కారణంయేమంటే అదివరకు అతడు రోజూ సంపాదించే రు. 0-6-0 లు లేక రు. 0-5-0 కూలి తనకు సరిపోయేదట, పెళ్లి అయిన తరువాత ఆ సంపాదనచాలక నేతపని మాని కళాయిపూతవల్ల రోజుకి రు.1-0-0 లేక రు. 1-4-0 తెచ్చుకొనేవాడు. కళాధారమైన వృత్తివల్ల జీవనం చేయగలిగినవాళ్లగతి యీ నాటికి యీలాగువచ్చింది!

యుద్ధం 1943లో తూర్పు రంగంలోకి వ్యాపించడం విదేశ సైన్యాలు అసంఖ్యాకంగా మన దేశం వచ్చి చాల కాలంవుండడం ఒక విధంగా మేలే అయింది. విదేశీయులకు తివాశీలంటే యిష్టం కాబట్టి కొంతవరకు మన దేశంలోనే సరకు విడుదలకు అవకాశం కలిగింది. తివాసీలకు గిరాకీ కలిగి ధరలు లేచేయి. మజూరీలుకూడ పెరిగేయి. యుద్ధకాలంలోనే కాక యుద్ధానంతరం యించుమించుగా ప్రతి విదేశీయుడు ఒక తివాసీ కొని తన దేశం తీసుకువెళ్లేడు.

ఇంక ప్రస్తుత పరిస్థితి: ఉత్తర హిందూస్థానంలో లాహోరు, ముల్తాను, కాశ్మీరు, మిర్జాపూరు కేంద్రాలలో తివాసీ నేత విరివిగా ఉంది. దక్షిణ దేశంలో దీనికి ముఖ్య కేంద్రాలు గోదావరి, కృష్ణా జిల్లాలోని ఏలూరు, తంగెళ్లమూడి, శనివారపుపేట, మచిలీపట్టణం. ఇవికాక తిరువాన్కూరు, ఒరంగల్లులలోకూడ యీ పరిశ్రమ సాగుతూ వుంది. దీనికి కావలసిన ముడిపదార్థాలు ఉన్ని, రంగులు, గోకనూలు, పురికొస. ఈ ఉన్ని కృష్ణా, గోదావరి జిల్లాలలోని మచిలీబందరు, ఎలకుర్రు చిలకపాలెం,¦ తుమ్మిడి, ధర్మాజీగూడెం మొదలైన ప్రదేశాలలో దొరుకుతుంది. తిరునల్వేలి జిల్లా ఆంబూరులోకూడ ఉంది. కురుబిలు అనే గొల్లవారు గొఱ్ఱెలమందలు కాచి సాలుకు రెండుసార్లు (అనగా జూన్, డిశంబరు నెలలలో) ఉన్ని కత్తిరిస్తారు. ఆ వున్నిని వతనుగా నేతగాళ్లకు సరపరాచేస్తారు. ఈ వున్ని కాన్పూరు ఉన్ని. అంత ప్రశస్థమైనది కాదు. రెండు మూడు అంగుళాల లోపు పొడుగు గలిగి తెలుపు నలుపు అన్నీ కలిసి ఉంటుంది. దాని వల్లరంగు సరిగాపట్టదు. కొందరు నేతవారు తోలు పనిచేసే ఫ్యాక్టరీల ఉన్ని వాడుతారు. ఇందులో సున్నంకలియడంవల్ల నాణెమైన తివాసీలకిది ఉపయోగపడదు.

సాధారణంగా గొల్లవారి కుటుంబమే ఆ వున్నిని శుభ్రముచేసి కట్టెకకిలీతో వడికి దారంతీస్తుంది. సాధారణంగా 8 గంటల పనికి 6 పౌ. అనగా రెండు వీశల దారం తయారౌతుంది. ఈ ఉన్నిదారానికి పూర్వం వృక్షజాతి సంబంధమైన దేశవాళీ రంగులు వేసేవారు. ఇప్పుడు సాధారణంగా కెమికల్ రంగులే వాడుతున్నారు.

తివాసీ మగ్గం, నూలుమగ్గంలాగు కాక నిటనిలువుగా ఉంటుంది. దానికిపడుగు దారాలు నిట్టనిలువుగా కట్టుతారు. పడుగు క 4/4 నెంబరు నుంచి 14/40 నెంబరు నూలువఱకు తివాసి యొక్క నాణెంబట్టి వాడుతారు. ఈ పడుగు దారాలకు ఉన్నిదారం ఒక నమోనాను, అనుసరించి ముళ్లుకట్టుతారు. ఈ పని చాలచురుకుగా చేయగలరు. ఒక వరుస ముళ్లుకట్టిన తరువాత పురికొస పేకగానేసి, దానిని ఒక దువ్వెనవంటి పనిముట్టుతో దగ్గరగా కొట్టి కత్తెరతో కత్తిరించి సాపుగా తయారుచేస్తారు. ఈ పని మంచి పనివాడు చేస్తూ ఉంటే చూడడం చాలాబాగా ఉంటుంది. తివాసీ నేతలో నేర్పు అంతా దీనితోనే వుంది. ఒక గజం వెడల్పు గల మంచిరకం తివాసీలో రోజుకి 6 అంగుళాలకంటె ఎక్కువ నేయడం కష్టం.

తివాసీ నేతకు ముందు దానిపైని వేసే నమోనా తయారు కావాలి. ఈ నమోనా ఒకగళ్ల కాగితంమీద వ్రాసుకొని ఆ ప్రకారం ముళ్లుకట్టుతారు. పేరెన్నికగల నమోనాలలో పార్శీ నమోనాలు, మొగలు నమోనాలు మొదలైన పేర్లు

తివాసీ పరిశ్రమ


ఉన్నాయి. వీటిలో పువ్వులు, లతలు, మొక్కలు, పద్మాలు చిత్రవిచిత్రమైన కలయికలో చాల ఆకర్షంగా ఉంటాయి. ఈ నమోనాయే తివాసీకి జీవం అని చేప్పవచ్చును.

తివాసీ నాణెంలో అనేకరకాలు. ఒక అంగుళానికి నాలుగు లేక మూడున్నర ముళ్లుకలది సాదారకం. దీనిలో నమోనా అంత అందంగా కనుపించదు. అంగుళానికి 4 లేక 7 ముళ్లుకలది కొంత నాణెమైనదన్నమాట. అంగుళానికి 8 మొదలు ఆపైన ముళ్లు ఉంటే అది ఉత్తమశ్రేణికి చెందిన తివాసీ అన్నమాట. ముళ్లు ఎక్కువయిన కొద్దీ నేత సన్నంగా చిక్కగా ఉండి, నమోనా స్పష్టంగా కనబడుతుంది. అది సాదాతివాసీకి, నాణెమైన తివాసీకి తేడా.

తివాసీ పరిశ్రమాభివృద్ది బాగా లేకపోవడానికి కారణాలు, అన్నికురుచగా ఉండి, అన్నిరకాలు కలసిపోయి, దారం సరిగా వడకకపోవడం. అమ్మకంలో వర్తకులు లాభాలు పొందడం. ఉన్ని యొక్క నాణ్యం విషయంలో వ్యవసాయ శాఖవారు తగుశ్రద్ధ తీసికొన్నట్లైతే గొర్రెలు అభివృద్ధి పొంది ఈ సమస్య తీరుతుంది. అమ్మకం విషయంలో సహకారోద్యమం వ్యాప్తిపొందాలి. ఏలూరులో ఇండియా ప్రభుత్వ సహాయంవల్ల 1937 లో తివాసీల నేత, సహకారసంఘం ఏర్పాటైకొంత పని చేస్తూ ఉంది. అందు 90 మగ్గాలు ఉండి సాలీనా ఒక లక్షరూపాయల వ్యాపారం జరుగుతూవుంది. కాని ఏలూరులోని 500 తివాసీ మగ్గాలు సహకారసంఘంలో చేరితే పరిస్థితులు యింకా బాగుంటాయి. ఆప్రకారంగానే అన్ని కేంద్రాలలోను తివాసీ పనివారు సహకారసంఘాలలో చేరితే యీ తివాసీ పరిశ్రమ, శీఘ్రకాలంలోనే చాల అభివృద్ధిపొంది, పూర్వప్రఖ్యాతి మరల తేగలదు.

(ఆలిండియా రేడియోవారి అనుమతిని)

★



ఒక వీటో ఫెరిన్ దివ్యమైన సర్వసాధారణ టానిక్కు. దీనిలో ఏ. డి. విటమినులు, ఇనుము, ఇంకా ఆరోగ్యదాయకములైన తదితర ఖనిజములు ఉన్నవి. దీనికి మధురమైన రుచి ఉన్నది.

I·T·L

మైసూర్ ఇండస్ట్రియల్ అండ్ టెస్టింగ్ లెబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు వారి తయారు

ప్రాడక్టు

సెల్లింగ్ ఏజెంట్లు : బెస్ట్ అండ్ కంపెనీ, లిమిటెట్. P. B. నెం. 63 మద్రాసు.

DJK 12

సోదరీమణీ!

రచన: శ్రీ దొంతుకుర్తి సూర్యనారాయణశాస్త్రిగారు.

మేలుకొనుమా సోదరీమణీ మేలుకోవమ్మా
మేలుకొని ఎదిరించవమ్మా సంఘశక్తితో జయముకలుగు ॥మే॥

తరతరంబులనుండి సలిపెడుసంఘదౌష్ట్యాల్ రూపుమాపగ
దీక్షబూనుముస్వార్థపరులను బయలుచేయగ ఐక్యశక్తితో ॥మే॥

అబలలనివాగేటివారలు సబలలనివిస్మయము చెందగ
ధాటిజూపుముఝాన్సిరాణిని మనసునందునతలచుకొనుచూ ॥మే॥

బహుభార్యతత్వం బంతమొందగ ప్రతినబూనుముపటిమతోడను
క్రూరకృత్యాల్ సాగబోవని పలుకవమ్మా నీదుశక్తితో ॥మే॥

వనితలంటేపరులపాలిటి జీవయంత్రాలనెడివారల
బుద్ధిగరపగ తరలిరమ్మా నీదుశక్తినివిస్మరించక ॥మే॥

స్త్రీలుచదివితె తమదునైచ్యంసాగబోదని మదిదలంచి
విద్యఎందుకు? వనితకనియెడి వెంగళాయలశిక్షచేయుము ॥మే॥

భావిపౌరులసృష్టిచేసెడు నీదుజ్ఞానమె జగతిమూలము
నీదుజాతి నిరక్షరత్వము సిగ్గుచేటనిమదిదలంచి ॥మే॥

అల సరోజిని, విజయపండిట్, అరుణఆసఫ్ ఆలిచూడుము ,,
యుగపురుషు వీరేశలింగము మదిదలంచిముందుకురుకుము ॥మే॥

అంటరానితనంబు లెంచకు, హిందుముస్లింభేదమెంచకు
సోదరత్వము పెంచవమ్మా, అనుపమప్రేమాశయములతో ॥మే॥

స్త్రీల వారసత్వపు హక్కు : మాతామహుని ఆస్తి

శ్రీమతి మేడపాటి లక్ష్మీకాంతంగారు

కేవలం స్త్రీ సంతానముగల ఆస్తిదారుయొక్క సర్వ ఆస్తికిన్ని, ఆస్తిదారు, అనంతరం అతను భార్య, ఆమె అనంతరం కుమార్తెలు, వారికి పిదప యిప్పుడు అమలునందు ఉన్న హిందూ లా ప్రకారం దౌహిత్రుడు వారసత్వానికి అర్హుడున్ను, దౌహిత్రిని (మనుమరాలు) అనర్హురాలును అగుచున్నది. ఉదాహరణకు ఆస్తిదారుకు యిద్దరు కుమార్తెలు ఉండియున్న ప్రస్తుతం అమలునందుగల హిందూ లా ప్రకారం ఆస్తిదారు అనంతరం అతను భార్యకు ఆమె అనంతరము కుమార్తెలకు సమానముగా చెందుచుండి యీ యిద్దరు కుమార్తెల అనంతరము వీరి యిద్దరకు పురుష సంతానముండిన ఆ పురుషులు సమానముగా అనగా తల్లుల యొక్క వాటాలవారీగా చెందును. స్త్రీ సంతానమునకు ఏలాంటి హక్కు ఉండదు. ఆస్తిదారు యొక్క యిద్దరు కుమార్తెలలో ఒక ఆమెకు పురుష సంతానముండి మరి యొక ఆమెకు స్త్రీ సంతానమే కల్గిన యెడల పురుష సంతానముగల కుమార్తె యొక్క పురుషులు సంపూర్ణ హక్కుదార్లై స్త్రీ సంతానము గల కుమార్తె యొక్క స్త్రీ సంతతికి, యేలాంటి హక్కున్ను ఉండదు గదా? ప్రస్తుతం అమలునందుగల హిందూ స్త్రీల వారసత్వ హక్కును గురించి అనేక కుటుంబములు పడుచున్న నష్టకష్టములలో కొన్నిటిని యిచట ఉదహరించెదను.

(1) పేరయ్య అను గృహస్థుకు బుచ్చెమ్మ అను భార్య యందు వెంకమ్మ అను కుమార్తె గలదు. అకస్మాత్తుగా పేరయ్య చనిపోయెను. తదుపరి వెంకమ్మకు వివాహమైంది. ఆమెకున్ను ఒక్కతే కుమార్తె కల్గినది. మరి సంతానములేదు. వెంకమ్మ అనంతరమునుండి ఆస్తి అన్యులు పాలుబడును గదా? వెంకమ్మ కుమార్తె యేకైక కుమారుని దత్తత చేసుకొనుటకు ఆలోచించిరి. తీరా దత్తత యిస్తే హిందూ ధర్మం ప్రకారం తల్లిదండ్రులకు కర్మకాండ జరుపుటకు పనికి రాడు అని జనక తల్లిదండ్రులకు ధర్మ సందేహము. దత్తత జరగక పోతే ఆస్తి పోతుంది అని ఎట్లైనా అని ఆలోచించి క్రియకు దత్తత చేసిరి. దౌహిత్రునికి మాతామహుని ఆస్తి యందు వారసత్వ హక్కు ఉంటే యింత యిబ్బంది ఉండదు గదా? మరి యొక కుటుంబములో సదుద్దేశముతో చేసిన ఏర్పాటు ఏ విధముగా భగ్నమైనది తెలుసుకొన గలరు. సుబ్బయ్య అను ఆస్తిదారుకు సీతమ్మ అను భార్య యందు సుబ్బమ్మ సూరమ్మ అను కుమార్తెలు మాత్రము గలరు. అకస్మాత్తుగా సుబ్బయ్య చనిపోయెను. చని పోవునపుడు తన కుమార్తె వివాహకాలమందు వరుని దగ్గర వస్తువులకు అవి తీసుకున్న సొమ్ము తన కుమార్తెలకు వస్తువులు చేయించ లేకపోతిని కనుకను అందు నిమిత్తము కొంత ఆస్తియున్ను పోను శేషించిన ఆస్తికూడా తన యిద్దర కుమార్తెలకు సంపూర్ణ హక్కులతో విల్లు వ్రాయమని తన భార్యకు ఆర్డరు యిచ్చెను. అంటే నోటి మాటగా మాత్రం. భర్త ఆజ్ఞ ప్రకారం భార్య సీతమ్మ తన యిద్దరు కుమార్తెలకు విల్లు వ్రాసినది. తదుపరి సీతమ్మ చనిపోయెను. సుబ్బమ్మ సూరమ్మ ఆస్తి పంచుకొనిరి. సుబ్బమ్మ భర్త నిస్సంతుగా చనిపోయెను. సూరమ్మకు యిద్దరు కుమారులు కుమార్తెలు గలరు. కుమార్తెలలో ఒక ఆమె భర్త నిస్సంతుగా చని పోయెను. ఆమె మనువర్తికి తగాయిదాలుపడి యావజ్జీవిత మనువర్తి క్రింద మూడువందలు అత్తవారి వద్దనుండి సూరమ్మ తీసుకున్నది. ఈ వితంతు కుమార్తె తల్లిగారి యింటివద్దనే ఉంటూ ఉండేది. సదరు సొమ్ము మూడు వందలు సూరమ్మ ఖర్చు పెట్టుకున్నది. ఇవి యీలా యీలాగున ఉండగా సుబ్బమ్మ తన చెల్లెలు పెద్ద కుమారుని అభిమాన పుత్రునిగా భావించి తన ఆస్తి తన అనంతరమునుండి అతనికి సెటిల్‌మెంటు వ్రాసి అందులోనే తన చెల్లెలు యొక్క వితంతు కుమార్తెకు జీవిత కాలంవరకు సంవత్సరం 1కి మూడు బస్తాలు యిచ్చుటకు ఏర్పాటు చేసి వ్రాసినది. ఆ అభిమాన పుత్రునికి బాల్య వివాహము చేసింది. ఇది యిట్లా ఉండగా సూరమ్మవంతు ఆస్తి తన కుమారులకు అప్పుడు ఉండుకున్న లావాదేవీలను గురించి తనవంతు ఆస్తి తన కోడండ్రుకు యిద్దరకు తన జీవిత అనంతరమునుండి చెందుటకు

స్త్రీల వారసత్వపు హక్కు : మాతామహుని ఆస్తి

విల్లు వ్రాస్తూ ఆ విల్లులోనే తన వితంతు కుమార్తెకు కోడలు 1కి సంవత్సరం 1కి 1 బస్తానర ధాన్యమున్ను ఆమెకు తన యింటివాటాలో ఒక గదియున్ను యిచ్చు యేర్పాటు చేసి విల్లు వ్రాసి చనిపోయినది. తదుపరి సుబ్బమ్మ జీవించి ఉండగనే అభిమాన పుత్రుడు చనిపోయెను. కొలది రోజులలోనే సుబ్బమ్మ చనిపోయెను. సుబ్బమ్మ ఆస్తి సూరమ్మ పెద్ద కుమారుని స్వాధీనములో ఉన్నది. ఫల సాయము అతను అనుభవించుచుండెను. ఇతని వితంతు కోడలు మనువర్తికి తగాయిదా పెట్టగా నీకు ఏమియు సంబంధములేదు యీ ఆస్తి నా పెదతల్లిది అని చెప్పి యివ్వ నిరాకరించెను.

ఈ తగవులు ఇట్లా ఉండగా ఇతని సోదరుడు యితనిని యితని భార్యను వితంతు సోదరిని తన భార్యను అన్న వితంతు కోడలిని ప్రతివాదులుగా జేర్చి దావా తెచ్చెను. అందులో యీ విధముగా వాదించెను. తన మాతామహుని ఆస్తికి తాను తన సోదరుడు హక్కుదార్లము అనిన్ని తన మాతామహుడు తన మాతామహికి విల్లు వ్రాయమని ఆర్డరు యివ్వలేదు అనిన్ని ఆ విల్లు చెల్లకూడగు అనిన్ని. తన తల్లి తన భార్యకు అన్న భార్యకు వితంతు సోదరికి వ్రాసిన విల్లున్ను తన పెదతల్లి అన్న కుమారునికి వ్రాసిన సెటల్మెంటున్నకూడా చెల్లతగ్గది కావు అని వాదించెను. కోర్టు ఆ ప్రకారం డిక్రి యిచ్చినది. సరే ఎట్లానయితే నేమి ఆస్తి అన్నదమ్ములకు చిక్కెను. గతములో భార్యల పేరను ఉండేది యిప్పుడు భర్తల పేర మారినది. ఇకను యావజ్జీవము అనాథజీవితములు గడుపుటకు వితంతువులు యిద్దరు రిక్త హస్తములతో హిందూ ధర్మముకు కట్టుబడి యెచ్చటనో యింత చాకిరి చేసేవారి దయదాక్షిణ్యములకు లోబడి జీవితముపైనుండు ఆశతో జీవించుచున్నారు. అంటే ఎవరికి జాలి. ఇటువంటి వారు పుణ్యభూమి కర్మభూమి అని పేరొందిన యీ భారతావనిలో నేకు లెఖ్ఖకు మిక్కుటమైన వారు కష్టభరితమైన జీవితములుగడపుచున్నారు. దీనికి కారణం భారత మహిళల యొక్క మాంద్యమనక తప్పదు. ఇకనైనను ప్రతి భారత వనితయు మాంద్యము వీడి హిందూ సంఘమునందు పురుషులకు ఏలాంటి వారసత్వ హక్కులు గలవో ఆలాంటి హక్కులు స్త్రీలు పొందుటకు ప్రయత్నించెదరుగాక. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులను బట్టి స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యము లభించనిదే యీ షణ్మాత్రము స్వాతంత్ర్యమున్నదని సంతసించిన లాభము లేదు. ఒరులపై ఆధారపడినంతవరకు స్వాతంత్ర్య మెట్లు లభించినది ? చూడండి. జనవరి నెల ఆంధ్రమహిళలో ఆర్థిక స్వాతంత్ర్యము లేకనే గదా, ఒక సోదరి తన చందా పూర్తి అయినది అని తెలుసుకొనికూడా తిరిగి చందా పంపలేక ఆవేదన పడినది ? నిజముగా ఆ సోదరికి పత్రికా పఠన యందు యెంత ఉత్సాహముండియు యెట్లు విరమించుకొనినదో గదా ? ఇట్లాంటి విషయములు మనదైనందిన జీవితములో ఎన్ని కలవంటారు ?

★

ఆయుర్వేద నిలయంవారి

లుకోరియా క్యూర్

స్త్రీలకు తరుచు సంభవించు ప్రదర రోగములకు, బహిష్టు నొప్పులకు దివ్యౌషధమని పది సంవత్సరముల అనుభవముచే చెప్పగలుగుచున్నాము. ఇంకను దీనిని సేవించుటవలన యితర గర్భాశయ వ్యాధులన్నియు నిర్మూలించి వంధ్యత్వమును తొలగించును.

90 మాత్రల ప్యాకెట్టు 2-8-0. ప్యాకింగు & పోస్టేజి అదనం.

ఆయుర్వేద నిలయం

రామానాయుడుపేట :: మచిలీపట్నం.

అన్ని మందులషాపులలోను దొరకును.

నేటి నృత్యం

శ్రీమతి సామ్రాజ్యం

నృత్యమంటే చాలాకష్టపడి కృషిచేయవలసిన విద్య. బాలబాలికలకు తొమ్మిది సంవత్సరాలు రాగానే ప్రారంభించాలి. అంటే అంతకు మించిన వయస్సువాళ్లు నేర్చుకోరాదనికాదు నా అభిప్రాయం. తొమ్మిదిపైన ఇరువైయైదు వయస్సులోపల వాళ్లంతా ఈ నృత్య విద్యను నేర్చుకోడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. అయితే ఆ నేర్చుకొనే వాళ్లకు దీనియందు అభిలాష ఉంటేనే!

తొమ్మిది సంవత్సరాలలోపల బాలబాలికలకు గుండె చాలా బలహీనంగా ఉంటుంది. నృత్యానికి తగిన పరిశ్రమ వాళ్లు చేయలేరు—చేయడం మంచిది కాదు. నృత్యానికి ముఖ్యమైనటువంటి లయ అంటే ఏమిటో వాళ్లకు తెలియదు. ఏదో చేతులు తిప్పడం తప్పితే అటువంటి పసి పిల్లలను నృత్యంలో ప్రవేశపెట్టకూడదు. శాస్త్ర యుక్తమైన నృత్యం నేర్చుకొనే వాళ్లకు సంగీతం, సంస్కృతం చాలా ముఖ్యం.

ఇప్పుడు నృత్యం చాలా పేద స్థితిలో ఉండటంటే కారణం? ఈ విద్యను కొద్ది మందైనా శాస్త్ర రీత్యా నేర్చుకోక పోవడం మూలాన్నే. నృత్యమంటే చాలా తేలిగ్గా 'ఇదొక పెద్ద గొప్పా?—మనం మాత్రం ఎందుకు చెయ్యలేం?' అని ప్రతి మనిషీ అనుకొని, పది సంవత్సరాలు నేర్చుకున్నప్పటికీ సంపూర్ణమయిందని చెప్పుకోలేని—అంతులేని ఈ విద్యను ఐదారు నెలల్లో కాళ్లు కొట్టడం—అర్థంలేకుండా చేతులుతిప్పడం—అంటే తను అభినయించే ఆ పాటకే ఎక్కడ ఏముద్ర ఎలా వినియోగించాలో, అసలు ముద్రంటే కూడా ఏమిటో తెలుసుకోకుండానే, ఈ విద్యలో సంపూర్ణత చెందాం—అనుకొని తాళంలేని తప్పటడుగులతో, అర్థంలేని అభినయంతో, నృత్యానికి సరిపోయే అంగసౌష్ఠవం గానీ లేకుండా ఎముకలపోగు దగ్గరనుంచీ పెద్ద పర్వతంలాంటి మనిషివరకు రంగస్థలం మీాదికి ఎక్కడానికి మనకు అర్హత ఉందా లేదా అనే యోచనైనా లేకుండా రంగస్థలంమీాదా తయారవడం నృత్యకళ యొక్క నేటి దౌర్భాగ్య స్థితికి కారణం. అదీ కాకుండా పది సంవత్సరాల లోపల వయస్సు వాళ్లనే రంగస్థలం మీాద కెక్కించి అభినయం అంటేనే అర్థంచేసుకోలేని పసి పిల్లలచేత అభినయం చేయించడం అభినయానికి జరుగుతున్న అంతులేని అన్యాయం.

నృత్యకళను బాలబాలికలు ముఖ్యంగా నేర్చుకోవాలి. రోజంతా కూర్చుని చదవడంలో శరీరానికి పరిశ్రమలేక, ఎముకల ఎదుగులేక మొద్దుబారిపోయి మెదడుకు విశ్రాంతిలేక వేడెక్కిపోయి ఉంటుంది. కాబట్టి బాలబాలికలంతా ఉదయం సాయంత్రం నృత్యం చేసినట్లయితే మెదడుకు విశ్రాంతి, శరీరానికి పరిశ్రమకలిగి విజ్ఞానంతోపాటు చక్కటి ఆరోగ్యంకూడా సంపాదించుకొన్నవారు అవుతారు. ఉదయం ఐదు గంట

లకు లేచి నృత్యానికి సంబంధించిన పరిశ్రమ నృత్యసాధనా—సాయంత్రం ఐదు గంటలుదాటిన తరువాత నృత్యం నేర్చుకోవడం; ఈ విధంగా సాధన చేసినట్లయితే నిత్యానందంతో సుఖ పడుతూ పడిపోయిన ఈ కళను పునరుద్ధరించిన వారు అవుతారు.

పదిహేను సంవత్సరాల లోపల బాలబాలిక లకు నృత్త ప్రధానమైనవి అలరిప్పు జతిస్వరము గీతము, తిల్లానా మొదలయినవి నేర్పాలి.

పదిహేను సంవత్సరాలు దాటిన యువతీ యువకులచేత అభినయ ప్రాధాన్యమైన శబ్దాలు, వర్ణాలు, పదాలు, తరంగాలు, అష్ట పదులు మొదలయినవి నేర్పి చేయించాలి.

ఒక భావాన్ని ప్రదర్శించాలంటే అర్థం తెలుసుకొని, అనుభవించి, అభినయించాలి. అభి నయం పదిహేను సంవత్సరాలు దాటిన వయస్సు వారిలోనే రాణిస్తుంది. చాలామంది చిన్న బాలి కలనే నృత్యంలో ప్రవేశపెట్టి వాళ్లకు యుక్త వయస్సురాగానే—అప్పుడే వాళ్ళు నృత్యానికి ఉండవలసిన అంగసౌష్ఠవంతో అర్థం తెలుసు కొని అభినయించగల పరిస్థితిలో ఉంటారు— మా అమ్మాయి పెద్దదయిందనీ, పెండ్లి చేయా లనీ, ఇంక నృత్యం పనికిరాదనీ—ఇదేదో మహా పరాధం క్రింద భావించి ఆపు చేస్తున్నాము.

బ్రహ్మచతుర్వేదాల సారాన్ని గ్రహించి నృత్యవేదమనే పంచమవేదాన్ని సృష్టించాడనీ ఇహపరమోక్ష సాధనానికి నృత్యమే మూలా ధారమనీ శాస్త్రం చెప్తూ ఉండగా ఇంకా దీన్ని ఇంత అధమ స్థితిలో ఉంచడం చాలా అన్యాయం.

అసలు నృత్యాన్ని అభ్యసించక పోయినా విచారంలేదు—కాని, అర్థం తెలియని అభి నయంతో లయలేని అడుగులతో, కళాకాంతులు లేని ముఖాలతో ఈ నృత్యకళ చావలేక బ్రతుకాలేక, తనకు జరిగే ఈ అన్యాయానికి చాలా దుఃఖిస్తూ ఉంది. దీనికి విమోచనం కలగాలంటే యువతీయువకులైన స్త్రీ పురుషు లంతా ఈ నత్యాన్ని నేర్చుకొని సాధన చేసినట్ల యితే స్వర్గతుల్యమైన ఆనందాన్ని పొంద గలుగుతారు.

ఈ విధంగా నృత్యాన్ని అభ్యసించినట్లయితే శరీరానికి మంచి పరిశ్రమకలిగి బలవంతులు గానూ, శరీరం ఎక్కువగా పెరిగి వికృతం కాకుండా, ఎముకలు కనిపిస్తూ క్షీణించి పోకుండా అందమైన అంగసౌష్టవంతో నిత్య యౌవనంతో ఆరోగ్యానందాలతో సంపూర్ణ ఆయుర్దాయంతో వర్ధిల్లుతారని శాస్త్రం చెప్తూ ఉంది.

భయపడకుడు

సమస్తవ్యాధుల నివారణోపాయము తెలియ జేయు "ప్రకృతి వైద్యము"ను గ్రంథము


0—8—0

పోస్టు బిళ్ళలకు పంపబడును.

శ్రీ యోగాశ్రమము (పోస్టు)

మునులతోట, (Via) రేపల్లె,

గుంటూరుజిల్లా.



తణుకు శ్రీ బాలసరస్వతీ

స్త్రీ సమాజం వార్షికోత్సవము

గత నెలలో 3వ తేదిని తణుకు శ్రీబాల సరస్వతీ స్త్రీ సమాజంవారి వార్షికోత్సవం శ్రీమతి పొణకా కనకమ్మగారి అధ్యక్షతను జరపబడినది. మదరాసు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ శ్రీమతి చోడగం అమ్మన్న రాజాగారు, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు, మాజీ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ క్రొవ్విడి లింగరాజుగారు, శ్రీ రామభద్రరాజుగారు ఎం. ఎల్. సి. మొదలైన వారు ప్రత్యేకాహ్వానాలపై విచ్చేశారు. ఉదయం పతాకవందనోత్సవంతో కార్యక్రమం ప్రారంభమయింది. దైవ ప్రార్థన, సూత్ర యజ్ఞముచేసిన పిమ్మట ఆంధ్ర మహిళా సభ పూర్వవిద్యార్థిని, ప్రస్తుతం శ్రీ బాలసరస్వతీ స్త్రీ సమాజంలో నాట్యోపాధ్యాయిని అయిన శ్రీమతి వసంతకుమారి సంగీత కాలక్షేపం చేసింది.

సాయంకాలంజరిగిన సభలో శ్రీమతి చోడగం అమ్మన్న రాజాగారు ప్రారంభోపన్యాసం ఇస్తూ ఇలా అన్నారు:

స్త్రీలోకానికి ఇట్టి సంస్థలు చాలా అవసరం. చెన్నపట్టణంలో శ్రీమతి దుర్గాబాయమ్మగారు ఒక పెద్ద సంస్థను స్థాపించి అనేక మందికి విద్యగరపుతున్నారు. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గాంధీ మహాత్ముడు మొదలైనవారి కృషివల్ల స్త్రీలు సంఘంలో ఉన్నత స్థానానికి వస్తున్నారు. అనేక మంది ఉత్తమ పురుషులు తమ భార్యల ద్వారా తల్లుల ద్వారా ప్రోత్సాహం పొందే కీర్తిశాలురు, ప్రతిభావంతులు అయినట్లు మనకు తెలుస్తున్నది. దీనికి తార్కాణంగా శ్రీ వీరేశలింగం పంతులుగారి ధర్మపత్ని అయిన శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారిని మనంతలచుకొన వచ్చు. "మన భారత దేశం ఔదార్యానికి పేరు పొందిన"దని వైకౌంట్ మౌంట్ బాటెన్ సతీగా రెప్పుడో అన్నారు. అలా ఈ సంస్థను విరివిగా విరాళాలిచ్చి పోషిస్తున్న వారి పేర్లు చాలా వున్నాయి. నే నిదివరలో ఇటువంటి సేవను చేసినదాననుగాక పోయినా, నేను చేయగలిగినంత చేస్తాను."

కార్యదర్శిని శ్రీమతి మంత్రిప్రగడ వరలక్ష్మమ్మగారు నివేదికను చదివారు. విద్యార్థినులు హిందీ, సంస్కృతాలలో సంభాషణలు జరిపారు. శ్రీమతి ప్రేమవతమ్మగారు, తాను శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మగారు 1932లో చిన్న గ్రంథాలయంగా స్థాపించి, తరువాత తమ పుత్రిక పేరనామకరణం చెయ్యడం, ఆతర్వాత శ్రీ పోతాప్రగడ అంకరాజుగారు సమాజాన్ని పెద్ద విద్యాసంస్థగా వృద్ధి చెయ్యడం మొదలైన విశేషాలను, సమాజ చరిత్రను వివరించారు.

శ్రీ లక్ష్మీబాయమ్మగారు సమాజంతో తమకుగల పరిచయాన్ని విశదీకరిస్తూ సమాజం చేస్తున్న సేవను ఉగ్గడించారు.

సమాజం నేర్పుతున్న విద్యా విధానాన్ని శ్రీ పోతాప్రగడ శ్రీరామారావుగారు వివరించారు. ఉపన్యాసాలకు పిమ్మట నాటక, నృత్య ప్రదర్శనలు జరిగాయి.

మరునాటి సమావేశంలో అధ్యక్షురాలు శ్రీమతి పొణకా కనకమ్మగారు రాజకీయ, సాంఘికరంగాలలో స్త్రీల పరిస్థితి ఎట్టిపరిణామాలుపొందుతున్నది తెలియ జేశారు. సభానంతరం తిరిగి నృత్య ప్రదర్శన బాపూజీ జీవితం బుర్రకథగా చెప్పడం జరిగినవి.


—సూరంపూడి భాస్కరరావు.

మహిళలలో జాగృతి

ఆంధ్ర కవయిత్రికి సన్మానం

విశాఖపట్నం జిల్లాలోని చోడవరం గ్రామంలో గత ఏప్రిల్ నాలుగవ తేదిని పండిత శ్రీమారేపల్లి రామచంద్ర శాస్త్రిగారి అధ్యక్షతను సభ జరిగింది. సుప్రసిద్ధ ఆధునికాంధ్ర కవయిత్రి శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారిని సత్కరించడంకోసంజరిగిన ఈ సమావేశంలో అధ్యక్షులు శ్రీ శాస్త్రిగారు, శ్రీ వేపా భీమశంకరం పంతులుగారు ఆమె కవితా మాధుర్యాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

భావ గాంభీర్యము, అర్థస్ఫురణమూ కలదే కవిత్వమనీ, అది దేశకాలాను గుణ్యంగా కూడావుండాలని శ్రీమతి రుక్మిణమ్మగారు అన్నారు. తమరచనలనుప్రచురిస్తున్న ఆంధ్ర మహిళ పత్రికను ప్రశంసించారు. ఉపన్యాసానంతరంతమ కావ్యాలలోని కొన్ని ఘట్టాలను వినిపించారు. తదుపరి శ్రీమతి చావలి సీతారామమ్మగారు ప్రసంగిస్తూ చంద్రునకు నూలు పోగన్నట్లుతాము, తమ సోదమణులు శ్రీమతి రుక్మిణమ్మగారికి 116 రూపాయలచ్చి గౌర విస్తున్నామని చందనతాంబూలాదులతో సహా ఇచ్చారు. శ్రీమతి రుక్మిణమ్మగారు సముచితంగా తమ కృతజ్ఞతను వెలిబుచ్చుతూ సమాధానమిచ్చారు.





అశోకా ఆమ్ల హెయిర్

ఆయిల్

తమతళుకు బెళుకులతో వెండి తెరకు వెలుగు వెన్నెలల నిచ్చే
ఫిలిం తారల కేమి—

గృహిణీ ధర్మ నిర్వహణకే ఏకైక లక్ష్యంగా గల
మహిళా మణులకేమి వారువీరననేల ఎల్లరకు కావలసినది ఒక్కటే!!

అది

అశోక ఆమ్ల హెయిర్ ఆయిల్

చల్లదనానికి, సౌందర్య పోషణకు, శిరోజవృద్ధికి
సాటిలేని మనోహరమైన తల నూనె

విజయకెమికల్ అండ్ టాయిలెట్ వర్క్సు

21, 22 సూర్యనారాయణ చెట్టి వీధి, రాయపురం మదరాసు.

శక్తి స్వరూపిణి స్త్రీ

మాతృక :
శ్రీమతి అనిబిసెంటుగారు

స్వేచ్ఛానువాదం :
శ్రీమతి రాజ్యలక్ష్మీదేవిగారు

ఏ దేశమూ స్వేచ్ఛా పురుషులచేత మాత్రమే నిర్మింపబడుట లేదు. దేశములోని భార్యలు, వారి భర్తలకు ధైర్యసాహసాల నిస్తారు. దేశములోని మాతలు స్వతంత్ర వాతావరణంలో ఆత్మ గౌరవంలో, శీలఔన్నత్యాలలో మన పనిని నిర్వహించే తరములను తయారుచేస్తారు. ఏ విహంగమూ ఒకే పక్షముతో నెగురజాలదు. జాతీయ జీవనంలో పురుషులు మాత్రమే భాగస్థులగుటవల్ల ఏ దేశమూ పైకి రాజాలదు. మనమందరమూ సమానులము కాము. వ్యత్యాసములున్నాయి. కాని, గౌరవ పూరితమై పరస్పర సహకారముతో కూడిన అభిన్నత్వములోనే పరిపూర్ణమానవత్వ మిమిడియున్నది.

స్త్రీలు తమ భర్తల ప్రక్క నిలబడి వారికి చేయూతగా నారితేరియుండుట, ఆర్యావర్తంలో ప్రకృతిసిద్ధముగా నున్నది. ఎందుచేత నంటే, ఆర్యావర్తము అనాది నుండియు నేర్పరులైన స్త్రీ పరిపాలకులను కలిగివున్నది. ఒక్కొక్కప్పుడు వారే నిజమైన పరిపాలకులుగనూ, మరొక్కప్పుడు బాలురైన వారి పుత్రులకు సంరక్షకులు వుండి పరిపాలించుట మన కాలమువరకునూ జరుగుచునేయున్నది.

దేవి విహీనుడైన దేవుడు లేడు. దేనిని ప్రేరేపించి తానందు నిబిడీ కృతమైయుండునో అట్టి పదార్థముతో కాకుండా శక్తివుండదు.

ఇంతేకాకుండా హిందూమత సిద్ధాంతము ప్రకారము భగవానుని యొక్క క్రియాశక్తి స్త్రీ స్వరూపిణియై యున్నది. సమస్త కష్టాల లోనూ అన్ని విషయావస్థలలోనూ దేవతలు రక్షణకోసం శక్తి (స్వరూపిణి)ని ప్రార్థిస్తారు. అదిగాక పురుష ప్రయత్నము నిరర్థకమైనప్పుడు స్త్రీ శక్తి జయించుటయు అట్టి శక్తిల్లో స్త్రీ చెడుగును పారద్రోలి, అతి సహనముతో మంచిని స్థిరపరచుటయు కలదు. మరియు స్త్రీ పవిత్రతరమునూ మధురతమమునూ అయిన 'మాత' యను పేర ప్రపంచములో ఆదిశక్తికి ప్రతినిధియైయున్నది. ఆదిశక్తి దేవదేవుని యొక్క నిజమైన బలమూ ప్రాణ అయివున్నది. దేశంలోనూ, హిందూ గృహాల్లోనూ, భారతదేశం యొక్క తప్పని సరియైన విజయము శక్తి స్వరూపిణి ప్రతినిధుల మైన మన యొక్క సహాయములో నుండి యున్నది. కాబట్టి మనము పరిపూర్ణధైర్య సాహసములతో ముందునకు పోవుదము.

బామ్మ - అమ్మమ్మ - కక్కబామ్మ

రచయిత : శ్రీ కవికొండల వేంకటరావుగారు

పైమకుటంలో వివరించిన ముగ్గురు స్త్రీలు నేడులేరు: చనిపోయినారు. ఆఖరు ఆవిడ అంతా ఆరునెలలై కాలం చేసింది. ఆమెతో మా కుటుంబంలోని ఒక తరం స్త్రీలోకం పూరాగా అంతరించింది అని అనుకోవచ్చు. వాళ్లతోపాటు జ్ఞాపకం వచ్చేవాళ్లు, మా వాళ్లల్లో చని పోయిన ఆడవాళ్లు, ఫక్తువృద్ధాంగనలు, చాలా మందివున్నారు—వెంకంబామ్మ అనీ, అన్నయ్యమ్మనీ, పల్లప్ప అన్నీ, బాపప్ప అనీ, రాజప్ప అనీ, వీరమ్మమ్మమ్మ అనీ, బుచ్చమ్మమ్మమ్మ గారనీ ఇలాంటి పేర్లతో వారంతా జ్ఞప్తికి రాకమానరు—పుష్కర తర్పణాలప్పు డెక్కడెక్కడి పితాళ్లు కనబడ్డట్టు.

వాళ్లందఱూకూడా డెభ్భైయెనభై మధ్యనో ఇంకా చెప్పాస్తే ఎనభై తొంభై మధ్యనో స్వర్గస్థులైనవారే! వీరిలో ఎవరు పోయినా మేమంతా అనుకొనీ ఓదార్పు మాట వొకటే "ఆవిడకేం తొంభై ఏళ్లావిడ! ఆవిడకేం ఎనభై ఏళ్ల ఆవిడ" అని.

ఏళ్లు! వాటికీ మరణానికి నిత్యసంబంధం ఎదోవుందను కుంటాను. అన్నో యేట పోయాడు, ఇన్నో యేట పోయాడు" అని ఏ పోయిన వాణ్ణి గురించి అయినా లెక్కింపక మానం.

నన్నెవరూ పైవాళ్లను గురించి వ్రాయమన లేదు. నేనె వర్నీ పైవాళ్లను గురించి నేర్వమనడం లేదు. కాని ఈలాగు వీరిని గురించి వ్రాస్తూ ప్రచురించడం ఎందుకు వచ్చిందీ అంటే—అది మా "దొడ్డమ్మ—ఆవిడకో డెబ్భైఅయి దేళ్లున్నాయి. పన్ను వొక్కటీ వూడలేదు. పని మునుపటి లాగే చేసుకుంటూ ఇల్లంతా చక్క పెట్టుకుంటుంది—ఆమె ఒకనాడు నాకు చెప్పిన ఈయుదంతాన్ని బట్టి వ్రాయ బుద్ధి పుట్టింది. వ్రాసిన తరువాత నాకు నేను చదువుకోగా అదో సంబుద్ధిలాతోచింది. చనిపోయిన ఆముసీని వాళ్లు తిరిగి ఈ లోకంలో అవతరించారు, వారివారి యౌవనరూపాల్తో, పుణ్య స్త్రీ భావాలతో చెప్పజాలని శిరితో, సంపదతో, సంతోషంతో పెళ్లిళ్ల సంబరాలతో అని అట్టే దివ్యదర్శన మబ్బినంత వేడుక అయింది.

మా "దొడ్డమ్మ" చెప్పిన ఆయుదంతం నాటికి నేను పుట్టనే లేదట. గోదావరికి ఆనకట్ట కట్టనే లేదట. ఆమె, ఆమె చెల్లెలు, అనగా మా "అమ్మ" ఒకరి కెనిమిదేళ్లు ఒకరికారేళ్లూనట. మా తండ్రి వైపు తాతయ్యలు వెంకయ్యగారు, రామయ్యగారు, అన్నవారు ఆజానుబాహురూపాల్తోను ప్రసిద్ధంగా వెలుగొందేవారట అప్పట్లో. మరీన్ని మా "దొడ్డమ్మ" మామగారు అన్నాయనకూడా దొడ్డవారే నట. మా దొడ్డమ్మకు మా అమ్మకు ఒక్కసారే పెళ్లిళ్లు చేయ నిశ్చయించి మా మాతామహుడు "రామయ్య పంతులుగా"రన్నాయన మగ పెళ్లివారిని, ఇరుతెగల వారిని తర్లిగమ్మన్నారట వారి చిత్తం వచ్చినట్టు!

పాఠకులారా! మీ ఊహా ప్రపంచంలో కనుకట్టుగా వెలిసిందా లేదా ఈపాటికైనా ఆకాలం? ఊహింపగలుగు తున్నారా ఆ మగవాళ్ల వారున్న వూళ్లూ ఆ ఆడ పెళ్లి వారున్న గ్రామమూను?

రాజ్మహేంద్రవరం తాలూకా కానన సీమ కొండల్లో వాండ్రు మగ పెళ్లివాండ్రు. కోనసీమ—అప్పటికి దాన్ని కోనసీమ అనే వారో లేదో నాకు సందేహమే, గోదావరి చివార్ని ఆడపెళ్లి వారు. అడవివుసిరికాయ సముద్రపు వుప్పు అనే సామెత తప్పకుండా తట్టి తీరుతుంది ఆ నాటి ఆ సంబంధ బాంధవ్యాల ఏర్పాట్ను గురించి యోజిస్తే!

ఇలా చెప్పసాగింది మా దొడ్డమ్మ, ఇక్కడనుంచి ఆ చరిత్ర మా కుటుంబంమట్టుకే మంత్రించి: "మీ బామ్మ కక్కబామ్మ ఇద్దఱు తోటికోడళ్లు చెరో మేనా మీద మీ నాన్న వోపట్టుకుచ్చుల పాలకీమీద బ్రహ్మాండంగా తోను, భజంత్రీలతోను తర్లి బాలుదేతి శ్రీరంగపట్నం నుంచి వాకలగరువు దాకా నాటుప్రయాణం గావించి వచ్చారు. బంధువులు ఇరవైరెండు రెండెడ్ల బళ్లమీద, గూటిబళ్లమీద, గంటలు మువ్వాలు, గణక్వణ, గణక్వణ అనేలా పెద్ద కోలాహలంగా విచ్చేశారు. దారి పొడుగు తా కాగడాలమీద సిద్దెలతో ఆముదం ఎంత పోసేరో మేరలేదు. ఆ వెలుక్కుముందూ వెనక ముందూ వెన

అయినప్పుడు అంచీఅంచీ వద్ద జాంబాయిగాళ్లు మేనాలు పల్లకీ ఆపేవారు. ఎక్కడికక్కడే చలివేంద్రలు సత్రవులు చలువ పందిరులు సమకూర్చాడు మా తండ్రి. ఊరూరా వీరణాల దిరీసులూడదీసి గోకుతూవుంటే దారి మధ్యను వున్న పూళ్లజనం యొక్క చెవుల్లోని బూజు ఎగిరి పోయిందంటే నమ్ము. ఊరూరు మధ్య రామడోలువాళ్లు బిగులూ దారూ అంటేనాదారు మనుష్యలు కంగారుపడ్డాయా అంటే విశ్వసించు. నాకలగరువంతా ఒకటే పెళ్లివాకిలి, పోకతోటలన్నీ ఒకటే భోగం అట: నిజంగా చెప్పాస్తే మీ బామ్మ చితాభస్మం అప్సరసల బగ్గుండగా మారి వుండదగ్గది: గోదావరిలో కలిపారుగాని." అంది చివరముక్కకూడా తేల్చి మా దొడ్డమ్మ ఆ చరిత్ర విస్తరించి అత్యుత్సాహంగా చెప్పే సమర్థత తనకే గలదన్నట్టు. నేనక్కడుండి వింటూ వున్నాను అన్న సంగతి ఏమరిల్లింది మా పెత్తల్లి.

నేనందుకున్నాను ఆ వెంటనే "లేదమ్మో! మా బామ్మ చితాభస్మం గోదారిలో కలపలేదు. నీ వెరుగవులాగుంది. నీవేదో మా మోలుముక్కగా తెలిసో తెలియకో అనేశావు గోదావరిలో కలిపారు అని, ఆలాకలపబడలేదు ఆమె కాటి భస్మం ఏయేటిలోను.

ఆమె భస్మం అస్థులు అన్నీ కోటిలింగాల గోదావరిలో కలుపుదామని మా వాళ్లు ఏంచాశారూ అంటే—ఒక తాటాకు బుట్టలో పోసి, బెల్లబుట్ట లాగట్టి, అంటే వడప లేసి అన్నమాట, అస్మశానపు జాయలవున్న వెదురు బిడెపు మొదటవుంచారుట, అదారే బండిని పోనిచ్చి, మంచి రోజుచూచి బండిమీద పెట్టుకుని రాజమహేంద్రవరం, అంటే ఇక్కడకు తీసికొని వచ్చి కోటిలింగేశ్వరు ప్రోాల అఖండ గౌతమిలో కలపాలనే కర్మకాంక్ష కొద్దీని. అయితే ఏం జరిగిందీ? తానొకటి తలిస్తే దైవ మొకటి తలిచాడన్నాట్టు వీళ్లు అంటు మా వాళ్లు, బండిమీద వేసుకు పదాం అని బుట్ట కోసరని పాద దగ్గఱ కెళ్లే సరికి అక్కడ బుట్టలేదు; బుట్టపోనీ విడిపోయి బూడిదవుందా అంటే అదీ జాడలేదు. పోనీ బూడిద పోయినా ఎముకలుండవా అని వెతకితే అవీ లేవు. బుట్టబుట్టే మాయమై పోయినట్టు కనబడింది. "ఏమైందంటే ఏమైంది బామ్మ భాస్మం" అని అప్పటినుంచీ ఏక ఆలోచనే నా మెదట్లో.

కొందఱు చెప్పారనుకో—దారేపోయే ఏటిపట్టి వాళ్లవళ్లో అదో బెల్లబుట్ట అనుకొని, నెత్తికెట్టుకు ఏ అర్థరాత్రో పట్టుకు పోయివుంటారు—అని. అయినా ఆ మాటనే నమ్మలేదు. ఎదో అయివుంటుంది: ఎదో అయివుంటుంది అనే నా యిది. ఎవరెంత చెప్పినా ఎవరేమి చెప్పినా ఆమె చితాభస్మకైంకర్యవిచింతనం కంచివర ఆడేటప్పుడల్లా శూన్య దృష్టినలాపడెయ్యడం ఈ సరికే జరిగింది. నీవు చెప్పినట్టు దొడ్డమ్మా! తక్కిన వాళ్లమాట నేను చెప్పలేను గాని మా బామ్మ చితాభస్మం అప్సరసల బగ్గుండగాపైకి నాకలోకానికి వెళ్లి శాశ్వతానందం నిజంగా పొందుతూ వుందనే నా నమ్మకం!"

నే నన్నమాటకే మా దొడ్డమ్మ తన తల తడుముకుంది. వితంతువైనా ఆమె తలకట్టు తీయించు కెరుగదు. తెల్లని నిడుపాటి వెండ్రుకలూ ఆమే తలెత్తి ఆలా తన చిన్నప్పటి రూపం చిత్రించుకోబోలు! "ఒరేయ్! మా తలలమీద ఆ పెళ్లి అయిదో రోజు దండాడింపప్పుడు—మీ బామ్మకు, కక్కమ్మకు, మా అమ్మకు, నాకు, మీ అమ్మకు అందఱకూ రాగిడీలు, సూరీడు చంద్రూడు, పాపిడి పింద్రీలు, చెవల్నీ జూకాలు, కొప్పులైతే కొప్పుల్లో, జటలైతే జటల్లో, నత్తులు, మెడల్లో కంటెలు, కాసుల పేర్లు, మొలల్ని వొడ్డాణాలు, వ్రేళ్లనుచుట్లు, కాళ్లను కడియాలు అందెలు పాంజేబులు, ముక్కుల్ని అడ్డబాసలు నత్తులు చేతల్ని కంకణాలు గోజీలు మఱి మేమంతా పెళ్లిళ్ల బగ్గుండదులుపుకుంటూంటే అయిన యీ వస్తువుల చప్పుడంతా యింతా కాదు" అంది మిక్కిలి సరదాగా!

"అదే చప్పుడిప్పుడుకూడా మా బామ్మ చితాభస్మం అచ్చరలు దులుపుకుంటూ గావించేరో! విను!" అని ఆమెను మఱింత హెచ్చరించాను.

★

సినిమా సమాచారాలు

జెమినీవారి చంద్రలేఖ : ఏ పత్రిక చూసినా ఈ చిత్రం ప్రకటనలే. ఎవరినుంచి విన్నా దీని ప్రశంసలే. ఇప్పటికి రాజధానిలో 50 కేంద్రాలలో ప్రదర్శిస్తున్నారీ చిత్రాన్ని.

చిత్రంలో శ్రీమతి టి. ఆర్. రాజకుమారి, సుందరీబాయ్ రంజన్, ఎం. కె. రాధ, మధురం, కృష్ణన్ అభినయించారు. రాజకుమారి చక్కగా పాడింది. మనోహరంగా నృత్యం చేసింది. చిత్రంలో ఆదినుంచి అంత్యంవరకు నేత్రోత్సవం చేయగల దృశ్యాలున్నాయి. ప్రతీ దృశ్యం వైభవాన్ని స్ఫురింప చేస్తున్నది. సర్కస్, డ్రండాన్సులు చిత్రంలోని ప్రధానాకర్షణలు. ఈ చిత్రాన్ని వ్యయప్రయాసలకు వెనుదీయక బ్రహ్మాండమైన ఫాయీలో తయారు చేసిన నిర్మాతలను ప్రశంసించక తీరదు.

*　　*　　*

వరలక్ష్మి, లక్ష్మిరాజ్యం, ప్రసాద్, ప్రకాశరావు, ప్రభాకర రావు—వీరందరితోను తయారవుతూవుంది "ద్రోహి" చిత్రం. దీనిని నిర్మిస్తున్నది స్వతంత్ర పిక్చర్సువారు. చిత్రం పూర్తి అయింది. విడుదల ఎప్పుడు జరిగేదీ ఇంకా ప్రకటించబడలేదు.

*　　*　　*

తన మహిమలచే దేశంలో శిష్యకోటిని సృజించుకొన్నాడు సాయిబాబా. ఆయన లీలలను వెండి తెరమీద మూసపోయడానికి సంకల్పించారు శ్రీ యూనిటీ పిక్చర్సువారు. శ్రీ మన్నవ రామచంద్రరావు, అద్దంకి శ్రీ రామమూర్తి సి. ఎస్. ఆర్. ఆంజనేయులు, సారపల్లి సత్యనారాయణ మొదలైన హేమాహేమీలతో చిత్రం పూర్తి అయింది. విడుదల తరవాయి.

*　　*　　*

అభినేత్రి కృష్ణవేణి, ఈలపాటకు పేరుపొందిన రఘురామయ్య, ఏ. వి. సుబ్బారావు, నాట్యరాణి అంజలీదేవి—వీరితో శ్రీ శోభనాచల పిక్చర్సువారు తయారు చేసిన "మదాలస" చిత్రం విడుదల అయింది. ఈ చిత్రాన్ని డైరక్టు చేసింది శ్రీ చిత్రపు నారాయణమూర్తిగారు.

శోభనాచలవారే మరో చిత్రం తయారు చేస్తున్నారు. అది "కీలుగుర్రం." అంజలీదేవి, నాగేశ్వరరావు ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు.

*　　*　　*

శ్రీమతి కృష్ణవేణి సొంతంగా ఎం. ఆర్. ఏ. ప్రొడక్షన్స పేరున "మన దేశం" అనే చిత్రాన్ని తయారు చెయ్యడానికి సన్నాహాలు అన్నీ పూర్తి చేసింది.

*　　*　　*

కృష్ణవేణి, ఋష్యేంద్రమణి, లింగమూర్తి మొదలైన వారితో శ్రీ స్వస్తిక్ ప్రొడక్షన్సువారు "ధర్మాంగద లేక పాము పాట" అనే చిత్రాన్ని తయారు చేస్తూవచ్చారు. ఈ మధ్యన ఈ చిత్ర నిర్మాణం కుంటుపడింది. ఇప్పుడు తిరిగి ప్రారంభమైనది.

*　　*　　*

పద్మనాభ పిక్చర్సువారు "చంద్రవంక" అనే చిత్రం తీస్తున్నారు. శ్రీమతి కాంచన్, ఆనందరావుగార్లు నాయికానాయకభూమికలు నిర్వహిస్తున్నారు. శ్రీ కాటూరి మోహన్ దర్శకుడు.

*　　*　　*

రాజమండ్రి ఈస్టర్న్ ఆర్ట్ ప్రొడక్షన్సువారు "గాంధీ నగర్" అనే సామాజిక చిత్రాన్ని తయారుచెయ్యడానికి మదరాసులో ఏర్పాట్లు చేసుకున్నారు. అంజలీదేవిని ఒక పాత్రకు ఎన్నుకొన్నారు. కొన్ని పాటలు శ్రీమతి అమీర్ బాయి కర్నాటకి పాడుతుంది. కుమార్ డైరక్టర్. కథకుడు శ్రీ పైడి వెంకట్రావు. సంభాషణలు శ్రీ చలం. పాటలు శ్రీ శ్రీ వ్రాశారు.

*　　*　　*

శ్రీ క్రాంతి పిక్చర్సువారు "సంక్రాంతి" అనే చిత్రం తయారు చేస్తూన్నారు. దర్శకుడు శ్రీ కాటూరి మోహన్. సంగీత దర్శకుడు శ్రీ [illegible]శం నాగేశ్వరరావు. పాటలు మాటలు శ్రీ బుద్ధవరపు నాగరాజా మాత్యుడు బి.ఏ.బి.ఇ.డి.

★

...kelanam
VETAPALEM